బుధవారం
08-06-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 70, సంచిక : 345
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

సామ్రాజ్యవాద చిహ్నం అమెరికా సమ్మిట్: క్యూబా

సమ్మిట్ ఆఫ్ అమెరికాస్‌ను సామ్రాజ్యవాద ఆధిపత్య, బహిష్కరణ వేదికగా క్యూబా అభివర్ణించింది. క్యూబా, వెనిజులా, నికరాగ్వాలను సమ్మిట్ ఆఫ్ అమెరికాస్ నుంచి మినహాయించాలన్న నిర్ణయం అమెరికా నియంతృత్వ ధోరణికి నిదర్శనంగా పేర్కొన్నారు.

2 లో

పోషకాహారం కరువు

▸ ఎనిమిదేళ్లలో నిత్యావసరాల ధరలు తారస్థాయికి

▸ వ్యాధులతో ప్రజలు మృత్యుముఖంలోకి...

2 లో

71 శాతం మందికి దిగజారిన కొనుగోలు శక్తి

కేంద్రంలోని మోదీ పాలన ప్రజాకంటకంగా మారింది. సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్, డౌన్ టు ఎర్త్ మ్యాగజైన్ విడుదల చేసిన నివేదిక ప్రకారం, 71 శాతం మంది భారతీయులు ఆరోగ్యకరమైన భోజనాన్ని కొనుగోలు చేయలేకపోతున్నారు. సగటు భారతీయుడి ఆహారంలో తగినంత పండ్లు, కూరగాయలు, చిక్కుళ్లు, గింజలు, తృణధాన్యాలు ఉండవని నివేదిక పేర్కొంది.

ఐదేళ్లు దాటితే బదిలీయే !

నేటినుంచి ప్రక్రియ ప్రారంభం

▸ 18 నుంచి మళ్లీ నిషేధం అమలు

▸ దంపతులు, వితంతువులకు ప్రాధాన్యం

▸ పాలనా సౌలభ్యం, వ్యక్తిగత సమస్యలూ పరిగణనలోకి

▸ ఉద్యోగుల బదిలీలపై ప్రభుత్వ మార్గదర్శకాలు విడుదల

విశాలాంధ్ర బ్యూరో‌– అమరావతి:
రాష్ట్రంలో ఉద్యోగుల సాధారణ బదిలీలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఆ మేరకు గతంలో బదిలీలపై విధించిన నిషేధాన్ని తాత్కాలికంగా ఎత్తేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీలకు సంబంధించిన విధి విధానాలను ఖరారు చేస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి షంషేర్ సింగ్ రావత్ ఉత్తర్వులు జారీ చేశారు. సుదీర్ఘకాలం తర్వాత రాష్ట్రంలో సాధారణ బదిలీలపై ఉన్న నిషేధాన్ని సడలిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం నిర్ణయం తీసుకున్న విషయం తెల్సిందే. అందుకు సంబంధించిన ఉత్తర్వులపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి సంతకం చేశారు. దీంతో ఉద్యోగుల సాధారణ బదిలీలపై ఉన్న అడ్డంకులు తొలగిపోయినట్లయింది. సీఎం ఆదేశాలతో ఆఘమేఘాలపై మంగళవారం అధికారులు మార్గదర్శకాలు రూపొందించి సాయంత్రానికల్లా జీవో 116 విడుదల చేశారు. దీని ప్రకారం జూన్ 8 నుంచి 17వరకు బదిలీల ప్రక్రియ కొనసాగుతుంది. జూన్ 18వ తేదీ నుంచి ప్రభుత్వ ఉద్యోగుల సాధారణ బదిలీలపై మళ్లీ నిషేధం అమల్లోకి వస్తుంది. ఒకేచోట ఐదేళ్లకు పైబడిన ఉద్యోగులను బదిలీలకు అర్హులుగా ప్రభుత్వం పేర్కొంది. బదిలీల్లో 40శాతం కంటే అధిక వైకల్యం ఉన్న ఉద్యోగులకు, మానసిక వైకల్యం గల పిల్లలున్న ఉద్యోగులకు ప్రాధాన్యత ఇస్తారు. కుటుంబీకులు దీర్ఘకాల వ్యాధులతో బాధపడే ఉద్యోగులకు, కారుణ్య నియామకాల కింద నియమితులైన వితంతువులకు, దంపతులిద్దరూ ప్రభుత్వ ఉద్యోగులై వేర్వేరు ప్రాంతాల్లో పనిచేసేవారికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ముఖ్యంగా దీర్ఘకాల వ్యాధులతో బాధపడేవారికి కేన్సర్, ఓపెన్ హార్ట్ ఆపరేషన్లు, న్యూరో సర్జరీ, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ వంటి సౌకర్యాలు ఉన్న

- మిగతా 2 లో

పర్యావరణంలోనూ అట్టడుగే...

ప్రపంచ ఆకలి సూచీలో అథమంగా ఉన్న భారత్ తాజాగా వెలువడిన పర్యావరణ సూచీలోనూ చిట్టచివరన నిలిచింది. మొత్తం 180 దేశాలపై అమెరికా వ్యవస్థల నివేదికల ఆధారంగా ఎన్విరాన్మెంట్ పర్ఫార్మెన్స్ ఇండెక్స్ (ఈపీఐ) 2022 వెలువడింది.

▸ 18.9తో చివరి స్థానంలో భారత్

▸ మైన్మార్, పాక్‌కన్నా అథమం

▸ 180 దేశాల ర్యాంకింగ్ విడుదల

2 లో

రైతన్నకు తోడుగా...

▸ ఆర్బీకేల్లో అధునాతన పనిముట్లు

▸ రైతు ఇష్టప్రకారమే కొనుగోలు

▸ నచ్చిన కంపెనీకి ఆర్డర్ ఇచ్చే వెసులుబాటు

▸ వైఎస్ఆర్ యంత్ర సేవా పథకం మెగా మేళాలో సీఎం జగన్

విశాలాంధ్ర–గుంటూరు:
విత్తనం నుంచి పంట విక్రయం వరకు ప్రతి దశలోనూ రైతన్నకు ప్రభుత్వం తోడుగా ఉంటుందని, రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతలకు అండగా నిలబడుతుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. రైతులకు అవసరమైన అధునాతన పనిముట్లను అందుబాటులోకి తీసుకొస్తున్నామని తెలిపారు. గుంటూరు చుట్టుగుంట సెంటర్‌లో మంగళవారం జరిగిన డాక్టర్ వైఎస్సార్ యంత్రసేవా పథకం మెగా మేళాలో 3800 ఆర్బీకే స్థాయి యంత్రసేవా కేంద్రాలకు 3,800 ట్రాక్టర్లు, 1,140 వ్యవసాయ పనిముట్లు, 320 క్లస్టర్ యంత్రసేవ కేంద్రాలకు 320 కంబైన్డ్ హార్వెస్టర్ల పంపిణీ, రైతు గ్రూపులకు 40 శాతం రాయితీ నిధుల విడుదల కార్యక్రమంలో జగన్

- మిగతా 2 లో

సీడీఎస్‌గా త్రివిధ దళాధిపతులూ అర్హులే...

నిబంధనలు మారుస్తూ కేంద్రం నోటిఫికేషన్

న్యూఢిల్లీ :
ప్రస్తుతం పదవుల్లో ఉన్నా లేదా రిటైర్ అయిన 62ఏళ్ల లోపు లెఫ్టినెంట్ జనరల్, ఎయిర్ మార్షల్, వైస్ ఎడ్మిరల్ స్థాయి అధికారులు చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) పదవికి అర్హులు అవుతారని కేంద్రం తెలిపింది. ఆర్మీ, నేవీ, ఐఏఎఫ్ (త్రివిధ దళాల) చీఫ్‌లనూ ఈ పదవి కోసం పరిగణించవచ్చు అని వెల్లడించింది. ఈ మేరకు వేర్వేరు నోటిఫికేషన్లను వైమానిక దళ చట్టం, ఆర్మీ చట్టం, నేవీ చట్టం ప్రకారం కేంద్రప్రభుత్వం జారీ చేసింది. సీడీఎస్ వయోపరిమితిని 65ఏళ్లకు పెంచేందుకూ ఆస్కారం ఉంటుందని నోటిఫికేషన్లలో పేర్కొంది. 'ప్రజా శ్రేయస్సు దృష్ట్యా అవసరమని కేంద్రప్రభుత్వం భావిస్తే సీడీఎస్‌గా ప్రస్తుత ఎయిర్ మార్షల్ లేదా ఎయిర్ చీఫ్ మార్షల్ లేదా ఆ పదవుల్లో పనిచేసి పదవీ విరమణ పొంది 62 ఏళ్లు మించకుండా ఉన్న వారిని నియమించవచ్చు' అని వైమానిక దళ చట్టం 1950 ప్రకారం నోటిఫికేషన్ వెలువడింది. అదే సమయంలో సీడీఎస్ వయోపరిమితిని 65ఏళ్లకు పెంచేందుకూ ఆస్కారం ఉంటుందని తెలిపింది. ఇదే విధంగా ఆర్మీ చట్టం 1950,

- మిగతా 2 లో

రక్తాన్నయినా చిందిస్తా...

8 లో

బెంగాల్‌ను ముక్కలు కానివ్వను: మమత

పశ్చిమ బెంగాల్‌ను ముక్కలు చేసే యత్నాలు అడ్డుకునేందుకు తన రక్తాన్ని చిందించేందుకు కూడా వెనుకాడనని తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ చెప్పారు. 'ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో, బీజేపీ ప్రత్యేక రాష్ట్ర హోదా కోసం డిమాండ్ చేస్తోంది. కొన్నిసార్లు గూర్ఖాలాండ్, మరికొన్ని సార్లు ఉత్తర బెంగాల్ ప్రత్యేక రాష్ట్రాన్ని కోరుతోంది. నేను నా రక్తం చిందించడానికి సిద్ధంగా ఉన్నాను, కానీ రాష్ట్ర విభజనను ఎప్పటికీ అనుమతించను' అని మమతా బెనర్జీ అన్నారు.

ఎవరు ఫెయిల్?

▸ ప్రభుత్వమా?... పిల్లలా ? ▸ పది ఫలితాలపై చర్చ

▸ డీఎస్సీపై జగన్ దగా-పాఠశాలల్లో టీచర్ల కొరత

▸ 71 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో జీరో పాస్

▸ ఆన్‌లైన్ పాఠాల ప్రభావం ▸ పరీక్షల సన్నద్ధతకు దూరం

▸ నూతన పరీక్ష పేపర్లపై అవగాహన కరువు

▸ ప్రభుత్వమే బాధ్యత వహించాలి: సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి:
ఏపీలో పదవ తరగతి పరీక్ష ఫలితాల ఉత్తీర్ణత తగ్గుదలకు ఎవరు కారణమనేది చర్చనీయాంశంగా మారింది. ఈ ఫలితాల తగ్గుదలకు కారణం రాష్ట్ర ప్రభుత్వమా?... పరీక్షలు రాసిన పిల్లలా? అనే ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. పది పరీక్ష ఫలితాల్లో రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 67.26 శాతమే ఉత్తీర్ణత అవ్వడం, ప్రభుత్వ పాఠశాలల్లోనే కాదు, పేరొందిన కార్పొరేట్ విద్యా సంస్థల్లోనూ ఉత్తీర్ణతా శాతం పడిపోవడంపైనా విభిన్న వాదనలు వినిపిస్తున్నాయి. గత చంద్రబాబు ప్రభుత్వ హయాంలో పది పరీక్షల ఫలితాల్లో భాగంగా 2015లో 91.42 శాతం, 2016లో 94.52 శాతం, 2017లో 91.92 శాతం, 2018లో 94.48 శాతం, 2019లో 94.88 శాతం చొప్పున నమోదయింది. సీఎం జగన్ ప్రభుత్వ హయాంలో 2020, 2021లో కరోనా కారణంగా పరీక్షలు నిర్వహించలేక పోయారు. జగన్ ప్రభుత్వ హయాంలో తొలిసారిగా నిర్వహించిన పది ఫలితాల్లో (ఏప్రిల్-2022) 67.26 శాతం రావడం విమర్శలకు దారితీస్తోంది. దీంతో ఫలితాలకు జగన్ ప్రభుత్వమే బాధ్యత వహించాలని ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. రెండేళ్ల నుంచి కరోనా ప్రభావంతో పాఠశాలలు పూర్తిగా నడవకపోవడం, ఆన్‌లైన్ పాఠాల బోధన అంతగా అబ్బకపోవడం, చాలా మంది విద్యార్థులు పది పరీక్షలకు సన్నద్ధం కాలేకపోయారు. మారిన నూతన పరీక్షా పత్రాలపై అవగాహన కొరవడం వెరసి ఉత్తీర్ణత తగ్గుదలకు కారణాలుగా కనిపిస్తున్నాయి. మూడేళ్ల నుంచి ప్రభుత్వం డీఎస్సీ నిర్వహించకపోవడంతో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత నెలకొంది. వారి స్థానంలో కనీసం అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించకపోవడంతో విద్యార్థులకు పూర్తి స్థాయి బోధన అందలేదు. గణితం, సామాన్య శాస్త్రం, సాంఘిక శాస్త్రం సబ్జెక్టు టీచర్లు పూర్తి స్థాయిలో లేకపోవడమూ ఒక కారణంగా భావిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సరిపడా టీచర్లు

- మిగతా 2 లో

ఇదీ లోకం!



ఇదిగో నిన్నే నా మాట కాస్త విను.

ఈఎస్ఐ డిస్పెన్సరీల్లో మందుల కొరత

▸ కొనుక్కోలేక బీమాదారుల అగచాట్లు

▸ సీడీఎస్ విధానం విఫలం

▸ నిలిచిన రోగనిర్ధారణ పరీక్షలు

విశాలాంధ్ర–విజయవాడ:
కార్మిక రాజ్య బీమా పథకం (ఈఎస్‌ఐ) క్రింద బీమా పొందిన కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు సహేతుకమైన వైద్య సంరక్షణ కల్పిస్తామన్న అధికారుల మాటలు ఆచరణలో అమలు జరగడంలేదు. వైద్యసేవలను అలక్ష్యం చేస్తే సహించేది లేదన్న పాలకుల హెచ్చరికలు నీటిమూటగా మిగిలిపోతున్నాయి తప్ప బీమాదారులకు ఇసుమంతైనా ఊరటకలగడంలేదు. ఈఎస్‌ఐ డిస్పెన్సరీలలో కనీస సేవలు బీమాదారులకు అందడంలేదనడం అతిశయోక్తికాదు. బీమా పొందిన కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు ప్రాథమిక చికిత్స అందించేందుకు ఏర్పాటు చేసిన ఈఎస్‌ఐ డిస్పెన్సరీలలో అరకొర సేవలు అందుతున్నాయి. బీమాదారులకు అవసరమైన కనీస మందులు కూడా అందుబాటులో ఉండడంలేదు. రోగనిర్ధారణ పరీక్షలు చేసేందుకు అవసరమైన మెటీరియల్ లేకపోవడంతో పరీక్షలు జరగడంలేదు. సీజనల్ మార్పులు, ఎండలు, ఇతర కారణాలతో అనారోగ్యం పాలవుతున్న కార్మికులు డిస్పెన్సరీలలో మందులులేక, వైద్య పరీక్షలు జరగక పడుతున్న బాధలు వర్ణనాతీతం. గత ప్రభుత్వ హయాంలో ఈఎస్‌ఐ డిస్పెన్సరీలలో సరఫరా చేసేందుకు మందుల కొనుగోలులో భారీ అవినీతి జరిగింది. దానితో ప్రభుత్వం తీసుకున్న చర్యలు కొండనాలికకు మందేస్తే ఉన్న నాలిక ఊడినట్టుగా

- మిగతా 2 లో

సామ్రాజ్యవాద చిహ్నం అమెరికా సమ్మిట్: క్యూబా

హవానా: సమ్మిట్ ఆఫ్ అమెరికాస్‌ను సామ్రాజ్యవాద ఆధిపత్య, బహిష్కరణ వేదికగా క్యూబా అభివర్ణించింది. క్యూబా, వెనిజులా, నికరాగ్వాలను సమ్మిట్ ఆఫ్ అమెరికాస్ నుంచి మినహాయించాలన్న నిర్ణయం అమెరికా నియంత్రత్వ ధోరణికి నిదర్శనంగా పేర్కొంది. ఈ వివక్షత ఆమోదయోగ్యం కాదని నొక్కి చెప్పింది. "ఈ ఖండాంతర శిఖరాగ్ర సమావేశం నుండి ఏ దేశాన్ని అప్రజాస్వామికంగా, ఏకపక్షంగా మినహాయించడాన్ని సమర్థించలేనిదిగా క్యూబా వెల్లడించింది. క్యూబా అధ్యక్షుడు డియాజ్-కానెల్ మే 25న తాను హాజరు కాబోనని ప్రకటించారు. అమెరికా శిఖరాగ్ర సమావేశానికి అన్ని దేశాలను సమానంగా ఆహ్వానించకపోతే ఇది క్యూబా తీసుకున్న దృఢమైన నిర్ణయంగా కానెల్ పేర్కొన్నారు. ఈ సమావేశానికి మినహాయింపు విధానాన్ని అమెరికా అహంకార పూరిత నిర్ణయంగా క్యూబా పరిగణించింది. సామ్రాజ్యవాద ప్రతిష్టకు లాభదాయకంగా జరిగే ఈ సమావేశం వేదిక కానుందని పేర్కొంది. అమెరికా అనైతిక చర్యలు, బ్లాక్‌మెయిల్‌లు, బెదిరింపులు, మోసం లాటిన్ అమెరికా దేశాల పట్ల సాంప్రదాయ ధిక్కారాన్ని ప్రతిబింబిస్తుంది. మెక్సికన్ అధ్యక్షుడు లోపెజ్ ఒబ్రడార్ చర్యలను గౌరవప్రదమైన, సాహసోపేతమైన, చట్టబద్ధమైన చర్యలుగా క్యూబా పేర్కొంది. క్యూబా, నికరాగ్వా, వెనిజులాలను అమెరికా శిఖరాగ్ర సమావేశానికి ఆహ్వానించకపోవడం చారిత్రాత్మక తప్పుగా చిలీ

అధ్యక్షుడు బోరిక్ పేర్కొన్నారు. బహుపాక్షిక సంభాషణలు మన దేశాల మధ్య మంచి సంబంధాలను ఏర్పరచుకోవడానికి వీలు కల్పిస్తాయనే నమ్మకంతో మేము వెళ్తున్నాము, ఇక్కడ ఎవరూ తనను తాను రక్షించుకోలేరు, మన దేశాలను బాగా అభివృద్ధి చేయడానికి మనం ఏకం కావాలని బోరిక్ తెలిపారు.

విశ్వాస పరీక్షలో నెగ్గిన బ్రిటన్ ప్రధాని

బ్రిటన్ : ప్రధాని బోరిస్ జాన్సన్ విశ్వాస పరీక్షలో నెగ్గారు. బోరిస్‌పై సొంత పార్టీ సభ్యులే అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టిన సంగతి తెలిసిందే. పార్టీ గేట్ వ్యవహారంపై జాన్సన్ విమర్శలు ఎదుర్కొంటున్నారు. బోరిస్‌కు మద్దతుగా కన్జర్వేటివ్ పార్టీకి చెందిన 211 సభ్యులు ఓటు వేశారు. అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా 148 మంది సభ్యులు ఓటు వేశారు. ఈ సందర్భంగా బోరిస్ జాన్సన్ మాట్లాడుతూ.. 59 శాతం మంది సభ్యులు తనకు మద్దతుగా నిలవడం సంతోషంగా ఉందన్నారు. ఈ విజయం తనకు శుభ పరిణామంగా పేర్కొన్నారు. ఇది చాలా సానుకూల, నిర్ణయాత్మకమైన ఫలితంగా తాను భావిస్తున్నట్లు జాన్సన్ తెలిపారు. ప్రధానంగా ప్రజల సమస్యలపై దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. 2019లో బోరిస్ జాన్సన్ భారీ విజయం సాధించిన సంగతి తెలిసిందే. అయితే కోవిడ్ లాక్‌డౌన్ సమయంలో డౌనింగ్ స్ట్రీట్‌లో జోరుగా పార్టీలు జరగడం కోవిడ్ నియమావళిని ఉల్లంఘించి ఆ పార్టీలకు ప్రధాని బోరిస్ హాజరైనట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో విపక్ష ఎంపీలు బోరిస్‌పై అవిశ్వాస తీర్మానాన్ని ప్రకటించాయి

మెక్సికోలో సామాజిక శాస్త్రాలపై సదస్సు

మెక్సికో సిటీ : సామాజిక శాస్త్రాలపై 9వ లాటిన్ అమెరికన్, కరేబియన్ సమావేశం (క్లాస్కో) మంగళవారం నేషనల్ అటానమస్ యూనివర్శిటీ ఆఫ్ మెక్సికోలో ప్రారంభమైంది.

ఈ సమావేశానికి 10,000 వేల మంది ప్రొఫెసర్లు, ప్రత్యేక అతిథులు హాజరయ్యారు. సైద్ధాంతిక, ఆచరణాత్మక సమస్యలతో కూడిన ఈ సమావేశం ఈ ప్రాంతంలోని ఆర్థిక, సామాజిక అసమానతలను చర్చిస్తుంది. ఇది లాటిన్ అమెరికా, కరేబియన్‌లో దేశాల సామాజిక శాస్త్రాలు, మానవీయ శాస్త్రాలకు చెందిన అతిపెద్ద విద్యా కార్యక్రమం. ఈ సమావేశలంలో అంతర్జాతీయ పుస్తక ప్రదర్శన, అంతర్జాతీయ చలనచిత్ర ధారావాహికలు ప్రదర్శనలో ఉంటాయి. లాటిన్ అమెరికా కౌన్సిల్ ఆఫ్‌సోషల్ సైన్సెస్, హ్యూమానిటీస్ కో ఆర్డినేటర్, మెక్సికో సిటీ ప్రభుత్వ అధిపతులు పాల్గొంటారు. ముఖ్యంగా లాటిన్ అమెరికా, కరేబియన్ దేశాల్లో అసమానతలు, పోరాటాలపై చర్చలు జరుగుతాయి. చర్చల మొదటి రోజు స్త్రీవాద సమస్యలు, యువత బాల్యం, వలసలు, సంరక్షణ సమాజం, లింగ హింస, భద్రతా విధానాలు,వ్యవసాయ సంఘర్షణలు,శాంతి ప్రక్రియలు, ప్రకృతి, పర్యావరణం, ఆరోగ్యం, విద్య, సైన్స్, టెక్నాలజీ రంగాలపై నిపుణుల సలహాలు, సంప్రదింపులు ఉంటాయి.

ఈఎస్ఐ డిస్పెన్సరీల్లో మందుల కొరత

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నాయి. మందుల కొనుగోలులో అక్రమాలను సరిచేయాలనే ఉద్దేశంతో బీమా వైద్యసేవల డైరెక్టర్ (డీఐఎంఎస్)గా ఐఏఎస్ అధికారిని నియమించినా ఫలితం శూన్యం. డీఐఎంఎస్‌గా గత ఏడాది జనవరిలో బాధ్యతలు చేపట్టిన డాక్టర్ ఎస్‌బీ రాజేంద్రకుమార్ లకింశెట్టి బాధ్యతలు చేపట్టిన తరువాత ఈఎస్ఐ ఆసుపత్రులలో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించేందుకు అనేక చర్యలు చేపట్టారు. అందులో చాలా వరకు సత్ఫలితాలిచ్చాయి. డీఐఎంఎస్ కార్యాలయంలో కొంత మంది అధికారులు స్వప్రయోజనాల కోసం చేసే రాజకీయాలు, ఆసుపత్రి సూపరింటెండెంట్‌లు పట్టీపట్టనట్టు వ్యవహరించడం వల్ల కొన్ని సమస్యలు మరింత జటిలమయ్యాయి. మందుల కొనుగోలులో అక్రమాల నేపథ్యంలో గతంలో ఉన్న పద్ధతికి బదులుగా ఆన్‌లైన్ ఇండెంట్ విధానం తీసుకువచ్చారు. గత 48 సంవత్సరాలుగా జాయింట్ డైరెక్టర్ (జేడీ) కార్యాలయం నుంచి మందులను కొనుగోలు చేసి తమ పరిధిలోని ఈఎస్ఐ ఆసుపత్రులు, డిస్పెన్సరీలకు పంపించేవారు. జాయింట్ డైరెక్టర్లు ఎప్పటికప్పుడు మందుల కంపెనీల వారిని, డిస్ట్రిబ్యూటర్లను ఫాలోఅప్ చేసి మందులు సకాలంలో వచ్చేలా చూసేవారు. అయితే, జేడీ కార్యాలయం నుంచి మందుల కొనుగోలులో అనేక అక్రమాలు చోటుచేసుకోవడంతో ఆ పద్ధతికి ఫుల్‌స్టాప్‌పెట్టి ఈఎస్ఐ ఆసుపత్రుల సూపరింటెండెంట్ల నేతృత్వంలో సెంట్రల్ డ్రగ్స్ స్టోర్స్ (సీడీఎస్) ఏర్పాటు చేసి దాని ద్వారా మందుల కొనుగోలు ప్రారంభించారు. ఈ విధానం పూర్తిగా వైఫల్యం చెందింది. మందుల కంపెనీలు, డిస్ట్రిబ్యూటర్లతో సూపరింటెండెంట్లకు సంబంధాలు లేకపోవడం, కొంతమంది సూపరింటెండెంట్లు అలసత్వంతో వ్యవహరించడం వల్ల సీడీఎస్ విధానం ఆశించిన ఫలితాలు ఇవ్వలేదు. దానితో ఈఎస్ఐ డిస్పెన్సరీలలో మందులు లభ్యంకావడంలేదు. అత్యవసరమైన గుండె, కిడ్నీ, కేన్సర్, బ్రెయిన్‌కు సంబంధించిన మందులు సైతం ఆసుపత్రులలో అందుబాటులో ఉండడంలేదు. సుగరు, బీపీ, గ్యాస్, ఐరన్, విటమిన్ వంటి బేసిక్ డ్రగ్స్ కూడా డిస్పెన్సరీలలో అసలు అందుబాటులో ఉండడంలేదు. ఒకటోరెండో రకాలు ఉన్నా అవి నాసిరకానివి, లేదా తక్కువ ప్రమాణాలు కలిగినవి. పేరాసెట్రమాల్ టాబ్లెట్లు కూడా ఈఎస్ఐ డిస్పెన్సరీలలో అందుబాటులో లేవంటే పరిస్థితి ఎంత ఘోరంగా ఉందో అర్థమవుతుంది. పరీక్షలకు సంబంధించిన మెటీరియల్ గత కొన్ని నెలలుగా అందుబాటులో ఉండడంలేదు. దానితో డిస్పెన్సరీలలో గత కొద్ది సంవత్సరాలుగా పరీక్షలు చేయడం నిలిపివేశారు. దానితో బీమాదారులు పరీక్షలు కూడా డబ్బు వెచ్చించి బయట చేయించుకోవాల్సి వస్తోంది. లేకపోతే గుణదలలోని ఈఎస్ఐ ఆసుపత్రికి వెళ్లి చేయించుకోవాల్సి వస్తోంది. అక్కడకు వెళ్లినా అన్ని పరీక్షలు అందుబాటులోలేవు. పరీక్షలు, మందులు గురించి బీమాదారులు అడుగుతుంటే డిస్పెన్సరీల్లోని వైద్యాధికారులు, ఇతర సిబ్బంది సమాధానం చెప్పలేక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో డిస్పెన్సరీలలో మందులు లేనప్పుడు బీమాదారు బయట కొనుక్కుని బిల్లులు పెడితే రీయింబర్స్‌మెంట్ చేసే వారు ఇప్పుడు అధికారులు ఆ పద్ధతినే మరచిపోయారు. బిల్లులను డిస్పెన్సరీ సిబ్బందే తీసుకోవడంలేదు. ఒక వేళ తీసుకుని పై అధికారులకు పంపించినా రియెంబర్స్‌మెంట్ జరగడంలేదు. గత నాలుగైదు సంవత్సరాల నుంచి బీమాదారుల రీయింబర్స్‌మెంట్ బిల్లులు కోట్ల రూపాయలలో పెండింగ్‌లో ఉన్నాయి. బీమాదారులు ఈఎస్ఐ కంట్రిబ్యూషన్ చెల్లించినప్పటికీ మందులు కొనుక్కోవటం, అవసరమైన పరీక్షలు బయట చేయించుకోవలసి వస్తోంది. దీనితో వారికి కేవలం కన్సల్టేషన్ ఫీజు మాత్రమే మిగులుతోంది తప్ప వైద్య బీమా అందడంలేదు. కనుక డిస్పెన్సరీలలో అవసరమైన మందులను అధికారులు తక్షణం అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఉంది. అదే విధంగా డిస్పెన్సరీల్లోనే ప్రాథమిక వైద్య పరీక్షలు నిర్వహించేలా పరికరాలు, కిట్‌లను అందుబాటులో ఉంచాలి.

సీడీఎస్‌గా త్రివిధ దళాధిపతులూ అర్హులే...

(మొదటిపేజీ తరువాయి)

నేవీ చట్టం 1957 ప్రకారం నోటిఫికేషన్లు వెలువడ్డాయి. త్రివిధ దళాధిపతుల పదవీకాలం మూడేళ్లు లేదా వారికి 62ఏళ్లు వచ్చేంత వరకు ఉంటుంది. ఈ క్రమంలో రిటైర్డ్ చీఫ్‌లకు సీడీఎస్ పదవి పొందేందుకు అవకాశం ఉండదు. ఎందుకంటే వారంతా 62ఏళ్లు వచ్చాకే పదవీ విరమణ పొందివుంటారు. కాగా, జనరల్ బిపిన్ రావత్ గతేడాది డిసెంబరు 8న హెలికాప్టర్ ప్రమాదంలో మరణించినప్పటి నుంచి సీడీఎస్ పదవి ఖాళీగా ఉంది. దేశ తొలి సీడీఎస్‌గా 2020, జనవరి 1న రావత్ నియమితులయ్యారు.

ఐదేళ్లు దాటితే బదిలీయే !

(మొదటిపేజీ తరువాయి)

ప్రదేశాలకు బదిలీకి అవకాశం కల్పిస్తారు. నోటిఫైడ్ ఏజెన్సీ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న అన్ని రకాల పోస్టుల భర్తీకి ప్రథమ ప్రాధాన్యత ఇస్తారు. వ్యక్తిగత వినతులు, పరిపాలన సౌలభ్యం ఆధారంగా కూడా బదిలీలను చేపడతారు. ఇక ప్రస్తుత బదిలీల నుంచి ఉన్నత విద్య (కాలేజ్ ఎడ్యుకేషన్), స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ, ఆరోగ్యం, వైద్య విధానపరిషత్, కుటుంబ సంక్షేమాన్ని మినహాయించారు. ఇటీవలే ఈ శాఖల్లో బదిలీలకు అవకాశం ఇచ్చినందున ప్రస్తుతం మినహాయించారు. దృష్టిలోపం ఉన్న ఉద్యోగులను ఖాళీ లభ్యతకు లోబడి వారికి నచ్చిన ప్రదేశంలో పోస్ట్ చేస్తారు. ఏసీబీ, విజిలెన్స్ కేసులు పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల అభ్యర్థనలు బదిలీలకు అనుమతించరు. ఇక గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాల ఆఫీస్ బేరర్ల బదిలీలపై స్టాండింగ్ సూచనలు పాటిస్తారు.

జైన్ మెడకు ఈడీ ఉచ్చు

రూ.2.85 కోట్ల నగుదు- 133 బంగారు నాణేలు సీజ్

న్యూఢిల్లీ : ఢిల్లీ మంత్రి సత్యేంద్ర జైన్ మెడకు ఈడీ ఉచ్చు బిగుసుకుంటోంది. మనీలాండరింగ్ కేసులో జైన్‌తో పాటు ఆయన సహనిందితుల ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోదా చేసింది. రూ.2.85 కోట్ల నగదు, 133 బంగారు నాణేలను స్వాధీనం చేసుకుంది. ఇదంతా అక్రమ సొమ్ము అని, గోప్యంగా ఉంచబడిందని ఈడీ ప్రకటన పేర్కొంది. సోమవారం ఢిల్లీతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో ఓ జ్యువలర్ ఆస్తులతో పాటు ఏడు చోట్ల తనిఖీలు నిర్వహించినట్లు ఈడీ తెలిపింది. జైన్ భార్య పూనమ్, ఆయన వ్యాపార సహచరులు అంకుశ్ జైన్, వైభవ్ జైన్, నవీన్ జైన్, సిద్ధార్థ జైన్ (రాం ప్రకాశ్ జ్యువలర్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్లు), జీఎస్ మథారూ (లాలా షేర్ సింగ్ జీవన్ విజ్ఞాన్ ట్రస్ట్ చైర్మన్), యోగేశ్ కుమార్ జైన్ (రామ్ ప్రకాశ్ జ్యువలర్స్ ప్రై.లి. డైరెక్టర్), అంకుశ్ జైన్ మేనమామ, లాలా షేర్ సింగ్ జీవన్ విజ్ఞాన్ ట్రస్ట్ ఆస్తులను సోదా చేసినట్లు ఈడీ ప్రకటన పేర్కొంది.

అక్రమ పత్రాలు, డిజిటల్ రికార్డులూ సీజ్ చేసినట్లు తెలిపింది. మొత్తం రూ.2.85 కోట్ల నగదు, మొత్తం 1.80కేజీల బరువున్న 133 బంగారు నాణేలను సోదా నిర్వహించిన ప్రాంతాల్లోని గోప్యస్థానాల నుంచి తీసి స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించింది. ఏప్రిల్‌లోనూ జైన్ కుటుంబానికి సంబంధించి రూ.4.81 కోట్ల ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది. జైన్ (57)ను మే 30న పీఎంఎల్‌ఏ చట్టం కింద అరెస్టు చేసి ఈనెల 9 వరకు ఈడీ కస్టడీకి పంపిన విషయం విదితమే.

రైతన్నకు తోడుగా...

(మొదటిపేజీ తరువాయి)

పాల్గొన్నారు. వేదిక వద్ద ఏర్పాటు చేసిన కంబైన్డ్ హార్వెస్టర్లు, ట్రాక్టర్లను ముఖ్యమంత్రి పరిశీలించారు. మేడికొండూరు మండలం విశదల రైతు వికాస గ్రూపుకు అందించిన ట్రాక్టర్‌ను పరిశీలించిన సీఎం...రైతు షేక్ ఖాసీంతో కలిసి ట్రాక్టర్ నడిపారు. వేదికపై వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ వ్యవసాయం మెరుగు కోసం రాష్ట్రవ్యాప్తంగా 10,750 రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు కావాల్సిన పనిముట్లను తక్కువ ధరకు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఇందుకుగాను రైతులతోనే గ్రూపులు ఏర్పాటు చేశామన్నారు. రైతులకు సబ్సిడీ 40 శాతం ఇచ్చి, మరో 50 శాతం తక్కువ వడ్డీకి బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించి, కేవలం 10 శాతం డబ్బులు చెల్లిస్తే ట్రాక్టర్లు సహా వ్యవసాయ వస్తువులన్నీ అందుబాటులోకి తెచ్చే గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నామన్నారు. అక్షరాల రూ.2,016 కోట్లతో ప్రతి ఆర్బీకేస్థాయిలో రూ.15 లక్షల విలువగల 10,750 వైఎస్సార్ యంత్ర సేవా కేంద్రాలను స్థాపిస్తున్నామన్నారు. ఇవి కాకుండా వరి ఎక్కువ పండించే 20 జిల్లాల్లో రూ.25 లక్షల చొప్పున కంబైన్డ్ హార్వెస్టర్లతో కూడిన 1,615 క్లస్టర్‌స్థాయి యంత్రసేవా కేంద్రాలను ఏర్పాటు చేయబోతున్నామన్నారు. 5,260 రైతు గ్రూపుల బ్యాంకుల ఖాతాల్లోకి రూ.590 కోట్ల విలువ చేసే సామగ్రితో, రూ.175 కోట్ల సబ్సిడీని రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నేడు పంపిణీ చేస్తున్న వ్యవసాయ యంత్రపరికరాలన్నీ కలిపి 6,780 ఆర్బీకేల్లోకి, మరో 391 క్లస్టర్ స్థాయి కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లకు దాదాపు రూ.700 కోట్ల విలువ చేసే ట్రాక్టర్లు, కంబైన్డ్ హార్వెస్టర్లు, ఇతర వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేశామన్నారు. ఏడాదిలోపే రూ.2,016 కోట్ల విలువ చేసే సామగ్రి రైతుల చేతుల్లో పెట్టబోతున్నామన్నారు. ఏ పనిముట్టు కావాలన్న రైతు ఇష్టానికి వదిలేశామని, నచ్చిన కంపెనీకి ఆర్డర్ ఇచ్చే వెసులుబాటు, స్వేచ్ఛ రైతుకు కల్పించామన్నారు. సబ్సిడీని ప్రభుత్వం నేరుగా రైతు ఖాతాకి జమ చేస్తుందని, అవినీతి లేకుండా వ్యవస్థను పాదర్శకంగా ముందుకు తీసుకెళుతున్నామన్నారు. జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం, రైతాంగం అభివృద్ధికి విప్లవాత్మక పథకాలు అమలు చేస్తూ ముఖ్యమంత్రి నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారన్నారు. పేద రైతులకు ఆధునిక వ్యవసాయ యంత్ర పరికరాలు, మన గ్రామాల్లోనే, మన ఆర్బీకేల్లోనే తక్కువ, సరసమైన అద్దెలకు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. తద్వారా సాగు పెట్టుబడి ఖర్చులు తగ్గించి నికర ఆదాయం పెంచాలనే బృహత్తర లక్ష్యంతో ముఖ్యమంత్రి ఈ పథకాన్ని అమల్లోకి తీసుకువచ్చారని చెప్పారు. అనంతరం ముఖ్యమంత్రి 5,260 రైతు గ్రూపు బ్యాంక్ ఖాతాలకు రూ.175.61 కోట్ల సబ్సిడీని బటన్ నొక్కి జమ చేశారు. రైతులకు మెగా చెక్కు అందించారు. ట్రాక్టర్లు, కంబైన్డ్ హార్వెస్టర్లు పంపిణీని జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, మంత్రులు కాకాణి గోవర్ధనరెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, విడదల రజిని, మేరుగ నాగార్జున, డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి, శాసనమండలి చీఫ్‌విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, శాసనసభ ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ, ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, నందిగం సురేశ్, జడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టీనా, నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, అగ్రిమిషన్ వైస్ చైర్మన్ నాగిరెడ్డి, వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ పూనం మాలకొండయ్య, మార్కెటింగ్ శాఖ ప్రధాన కార్యదర్శి మధుసూదనరెడ్డి, వ్యవసాయ శాఖ కమిషనర్ ప్రద్యుమ్న, మార్కెటింగ్ శాఖ కమిషనర్ హరికిరణ్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

పర్యావరణంలోనూ అట్టడుగే...

న్యూఢిల్లీ : దేశంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అభివృద్ధి గురించి ప్రగల్భాలే వినిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో పరిస్థితులకు ప్రభుత్వ పెద్దల మాటలకు ఏ మాత్రం పొంతనే లేదు. ప్రపంచ ఆకలి సూచీలో అథమంగా ఉన్న భారత్ తాజాగా వెలువడిన పర్యావరణ సూచీలోనూ చిట్టచివరన నిలిచింది. మొత్తం 180 దేశాలపై అమెరికా వ్యవస్థల నివేదికల ఆధారంగా ఎన్విరాన్మెంట్ పర్ఫార్మెన్స్ ఇండెక్స్ (ఈపీఐ) 2022 వెలువడింది. దీనిని యాలే సెంటర్ ఫర్ ఎన్విరాన్మెంట్ లా అండ్ పాలసీ; సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ ఎర్త్ సైన్స్ ఇన్ఫర్మేషన్, కొలంబియా యూనివర్సిటీ, యూకే, ఫిన్లాండ్ నెట్వర్క్ ఇటీవల ప్రచురించాయి. ప్రపంచ సుస్థిరత దశను సూచించే సమగ్ర నివేదికగా ఈపీఐ ఉంది. 11 విభాగాల్లో 40 అంశాల ఆధారంగా 180 దేశాలకు వాతావరణ మార్పుపై ప్రదర్శన, పర్యావరణ ఆరోగ్యంపై ర్యాంకులు ఇచ్చింది. అట్టడుగున భారత్ (ఈపీఐ స్కోరు 18.9), మియన్మార్ (19.4), వియత్నాం (20.1), బంగ్లాదేశ్ (23.1), పాకిస్తాన్ (24.6) దేశాలు ఉన్నాయి. సుస్థిరత కంటే ఆర్థిక వృద్ధికి లేదా ఇతర అంశాలకు ప్రాధాన్యత ఇచ్చిన దేశాలకు స్కోరింగ్ తగ్గింది. అత్యంత ప్రమాదకర స్థాయికి వాయు నాణ్యత పడిపోవడం, గ్రీన్‌హౌస్ ఉద్గారాలు తీవ్రంగా పెరిగిపోవడం వల్ల భారతదేశం మొదటిసారిగా ఈ జాబితాలో చివరిస్థానంలో నిలిచింది. చైనా 28.4 ఈపీఐ స్కోరుతో 161వ స్థానంలో ఉంది. కర్బన ఉద్గారాలను కట్టడి చేస్తామని హామీనిచ్చినప్పటికీ 2050 నాటికి గ్రీన్‌హౌస్ ఉద్గారాలను అమితంగా వెలువరించే

దేశాలుగా చైనా, భారత్ ఉంటాయని పరిశోధకులు వెల్లడించారు. పాశ్చాత్య సంపన్న ప్రజాస్వామ్యాల్లో అమెరికాది 20వ స్థానం కాగా మొత్తంగా 43వ స్థానంలో ఉంది. 2050కి కర్బన ఉద్గారాలను తటస్థీకరించగల దేశాల్లో డెన్మార్, బ్రిటన్ వంటి కొన్ని దేశాలు మాత్రమే ఉంటాయని ఈపీఐ నివేదిక చెబుతోంది. మిగతా చాలా దేశాలు తప్పుడు మార్గాన్ని అనుసరిస్తున్నందున గ్రీన్‌హౌస్ ఉద్గారాలు పెరిగాయని, ముఖ్యంగా చైనా, భారత్, రష్యాలో పరిస్థితి తీవ్రంగా ఉందని పేర్కొంది. రష్యా 112వ ర్యాంకులో ఉంది. ప్రస్తుత పరిస్థితే కొనసాగితే 2050 నాటికి అత్యధికంగా కర్బన ఉద్గారాలను విడుదల చేసే దేశాలుగా చైనా, భారత్, అమెరికా, రష్యా ఉంటాయని, దాదాపు 50శాతం ప్రపంచ కాలుష్యానికి కారకాలవుతాయని ఈపీఐ అంచనాలు సూచిస్తున్నాయి.

ఇంగ్లీషు మీడియం వల్లే ఉత్తీర్ణత తగ్గుదల

పవన్ మూడు ఆప్షన్లు అర్థరహితం

ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పది పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు విద్యా సంవత్సరం నష్టపోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి వెల్లడించారు. మంగళవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ ఇంగ్లీషు మీడియం వల్లే పది పరీక్షా ఫలితాల్లో ఉత్తీర్ణతా శాతం తగ్గి ఉండవచ్చని సజ్జల అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇంగ్లీషు మీడియంతో తొలుత సవాళ్లు, ఇబ్బందులు ఉంటాయని సీఎం జగన్ చెప్పారన్నారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం నింపి, పోటీ పరీక్షల్లో ముందుకెళ్లేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్‌కు తావులేకుండా కఠినంగా వ్యవహరించామన్నారు. ఇంతకాలం 90 శాతం ఉత్తీర్ణత ఎలా వచ్చిందనే దానిపై విమర్శించే వారంతా, సంజాయిషీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రెండేళ్లపాటు కరోనాతో విద్యా సంస్థలు సరిగ్గా నడవలేదని, రెండేళ్లపాటు పరీక్షలు లేనందున పోటీకి అవసమైన స్ఫూర్తి విద్యార్థుల్లో తగ్గిపోవచ్చు అని చెప్పారు. ఇన్‌స్టెంట్, బెటర్‌మెంట్ పరీక్షలు పెట్టేలా ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. పవన్ కల్యాణ్‌కు ఆప్షన్-1తో సొంతంగా అధికారంలోకి వస్తామనే నమ్మకం ఉంటే, ఇక మిగిలిన ఆప్షన్లు ఎందుకంటూ సజ్జల ఎద్దేవా చేశారు. పవన్ కల్యాణ్ అందుకున్న రాగానికి చంద్రబాబు ట్యూన్ కట్టారనీ, పొత్తులపై మాట్లాడే అవసరం తమకు లేదని తేల్చి చెప్పారు. పొత్తులపై మాకు విశ్వాసం లేదని, మీరు సింగిల్‌గా వచ్చినా, పొత్తులతో వచ్చినా అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. మాకు ప్రజలపై నమ్మకం ఉందని, ప్రజల అజెండాతో ముందుకెళ్తున్నామన్నారు. రెండేళ్లు సమయం ఉన్నా, పొత్తులపై వారే రోజుకో మాట మాట్లాడుతున్నారంటూ విమర్శించారు. గడప గడపకు కార్యక్రమం విజయవంతంగా జరుగుతోందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సంస్కరణలు, సంక్షేమం సాగుతోందని, రానున్న ఎన్నికల్లో ప్రజలు మళ్లీ వైసీపీని కోరుకుంటున్నారని పేర్కొన్నారు.

ఎవరు ఫెయిల్ ?

(మొదటిపేజీ తరువాయి)

లేరు. ఉన్న వారిని బోధనేతర పనులకు వినియోగించడంతో వారిపై అదనపు భారం పడుతోంది. ప్రైవేట్ విద్యా సంస్థలు నిర్వహించే సమావేశాలకు తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరవుతుండగా, ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశానికి అరకొరగానే వస్తుంటారు. కార్పొరేట్ విద్యా సంస్థల పిల్లలకు 6 నుంచి 10 తరగతుల వరకు ఐఐటీ, నీట్ ఫౌండేషన్ సిలబస్‌పైనే ప్రధాన దృష్టి కేంద్రీకరిస్తారు. పది పరీక్షలకు రెండు నెలల ముందు హడావుడిగా సిలబస్ బోధించడంతో విద్యార్థులు ఒత్తిడికి లోనై పది పరీక్షలను విజయవంతంగా రాయలేక పోయినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది పది ఫలితాల్లో 71 ప్రభుత్వ, ప్రైవేట్ రంగ పాఠశాలల్లో జీరో శాతం ఉత్తీర్ణత నమోదయింది. ఇందులో 13 ప్రైవేట్ పాఠశాలలు ఉండగా, మిగిలిన ప్రైవేట్ అనుబంధ రంగ పాఠశాలలున్నాయి. ఈ ఏడాది జరిగిన పది పరీక్షలకు మొత్తం 6,15,908 మంది హాజరు కాగా, వారిలో 4,14,281 మంది ఉత్తీర్ణులయ్యారు. మిగిలిన రెండు లక్షలకు పైగా విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. గణితం పరీక్షకు 6,15,327 మంది హాజరు కాగా, 4,93,839 (80.26 శాతం), సాంఘిక శాస్త్రం 6,15,206 మందికి 5,00,975 మంది (81.43 శాతం), సామాన్య శాస్త్రం పరీక్షను 6,15,366 మంది రాయగా, 5,05,719 (82.18 శాతం) మాత్రమే విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.

ఉపాధ్యాయులకు యాప్‌ల భారం

ఉపాధ్యాయులకు బోధనేతర పనుల సమాచారాన్ని ప్రత్యేక యాప్‌ల ద్వారా నిరంతరం అప్‌లోడ్ చేసే బాధ్యతలను ప్రభుత్వం అప్పగిస్తోంది. విద్యార్థుల సంక్షేమ పథకాల నుంచి పాఠశాల విద్యా, మౌలిక సదుపాయాల అభివృద్ధి వరకు అన్నీ ఉపాధ్యాయులే అంతర్జాలం ద్వారా సమాచారం చేరవేయాలి. ఇందులో ప్రధానంగా మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి బియ్యం, కూరగాయల వివరాలు, బాలికల ఫోటోలు, గుడ్లు, చిక్కీల జాబితా పంపాలి. విద్యార్థుల బూట్లు, ఏక రూప దుస్తులు, పుస్తకాల, పరీక్ష మార్కులు, విద్యార్థుల హాజరు శాతం, అమ్మఒడి పథకం వివరాలను వేయాలి. నిత్యం ఉపాధ్యాయులు పాఠశాలతోపాటు ఇంటి వద్ద కూడా ఈ బోధనేతర పనులు చేపట్టాలి. ప్రభుత్వం నాడు-నేడు కింద పాఠశాలలను అభివృద్ధి చేసి, అందులో విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులను నియమించలేదు.

ప్రశ్నపత్రాల మార్పు ప్రభావం

పది పరీక్షా ఫలితాల పై ప్రశ్న పత్రాల మార్పుల ప్రభావం విద్యార్థులపై పడిందని ఉపాధ్యాయ సంఘాలు పేర్కొంటున్నాయి. గతంలో ఏపీలో పది పరీక్షా పత్రాలు పేపర్-1, పేపర్-2గా (హిందీ సబ్జెక్టు మినహా) ఉండేవి. ఇందులో హిందీ 100 మార్కులకు ఒకే పేపరు, మిగిలిన సబ్జెక్టులైన ఆంగ్లం, తెలుగు, గణితం, సామాన్య శాస్త్రం, సాంఘిక శాస్త్రం పేపర్లను రెండేసి చొప్పున, మొత్తంగా 11 పేపర్లతో ఉండేవి. 2020 కరోనా సమయంలో ఏపీ ప్రభుత్వం పది పరీక్షల నిర్వహణలో ఎదురవుతున్న ఇబ్బందులను గుర్తించి, 11 పేపర్లను కాస్తా, 6 పేపర్లకు కుదించింది. దీంతో 100 మార్కులకు హిందీతోపాటు తెలుగు, ఆంగ్లం, గణితం, సామాన్య శాస్త్రం, సాంఘిక శాస్త్రంను ఒకే పేపరుగా మార్పు చేసింది. రెండు పేపర్ల సిలబస్‌ను ఒకే రోజు రివిజన్ చేసుకుని, పరీక్షకు ఎక్కువ మంది విద్యార్థులు సన్నద్ధం కాలేక పోయారనీ, అలాంటి వారంతా ఫెయిల్ అయ్యారనే కారణాలున్నాయి. రెండేళ్ల నుంచి పది పబ్లిక్ పరీక్షలు క్రమంగా లేనందున, ఆ సమయంలో 8, 9 తరగతుల విద్యార్థులకు పరీక్షలు జరగలేదు. వారంతా ప్రాథమిక అంశాల్లో సైతం పట్టు సాధించకపోయారు. మూడేళ్ల నుంచి డీఎస్సీ నిర్వహణలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ఎన్నికల ముందు అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి ఏటా మెగా డీఎస్సీ ఇస్తానని, సీఎం జగన్ ప్రగల్భాలు పలికి, అధికారంలోకి వచ్చాక ఒక్క డీఎస్సీ ఇవ్వకుండా నిరుద్యోగులను దగా చేశారు. నూతన టీచర్లు లేకపోవడంతో పది ఫలితాలపై ప్రభావం చూపింది.

పది పరీక్షా ఫలితాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

పదవ తరగతి పరీక్షా ఫలితాలలో అతి తక్కువ మంది ఉత్తీర్ణత కావడం దురదృష్టకరమని, దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. మున్సిపల్, ప్రభుత్వ పాఠశాలల్లో 50 శాతం మందే ఉత్తీర్ణులు కావటం, 71 శాతం ప్రభుత్వ అనుబంధ, ప్రైవేటు పాఠశాలల్లో ఒక్క విద్యార్థి కూడా ఉత్తీర్ణులు కాకపోవటం సిగ్గు చేటన్నారు. దీనికి ప్రభుత్వమే సమాధానం చెప్పాలన్నారు. వేలాది టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేయకపోవడం వల్ల ఈ ఫలితాలు వచ్చాయని ఆయన విమర్శించారు. తక్షణం మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసి మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు.

పోషకాహారం కరువు

న్యూఢిల్లీ : కేంద్రంలోని మోదీ పాలన ప్రజాకంటకంగా మారింది. ఓవైపు నిత్యావసరాల ధరలు, ఖర్చులు పెరిగిపోతుంటే.. మరోవైపు ప్రజల ఆదాయం పడిపోతున్నది. ఫలితంగా ప్రజలు కనీస పోషకాహారం కూడా కొనుగోలు చేయలేని దుస్థితి నెలకొంది. సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్, డౌన్ టు ఎర్త్ మ్యాగజైన్ విడుదల చేసిన నివేదిక ప్రకారం, 71 శాతం మంది భారతీయులు ఆరోగ్యకరమైన భోజనాన్ని కొనుగోలు చేయలేకపోతున్నారు. ప్రతి సంవత్సరం 17 లక్షల మంది సరైన పోషకాహారం లేని కారణంగా వ్యాధులతో మరణిస్తున్నారు. సగటు భారతీయుడి ఆహారంలో తగినంత పండ్లు, కూరగాయలు, చిక్కుళ్లు, గింజలు, తృణధాన్యాలు ఉండవని నివేదిక పేర్కొంది. ఇరవై ఏళ్లు అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న భారతీయుడు రోజుకు సిఫార్సు చేసిన 200 గ్రాముల పండ్లను రోజుకు 35.8 గ్రాములు మాత్రమే తీసుకుంటాడని నివేదించింది. కాగా పెద్దలు రోజుకు కేవలం 168.7 గ్రాముల కూరగాయలు తింటారు. అయితే కనీస సిఫార్సు వినియోగం రోజుకు 300 గ్రాములు. ఐక్యరాజ్యసమితి ఆహార, వ్యవసాయ సంస్థ వివరాల ప్రకారం, ఆరోగ్యకరమైన భోజనం ఖర్చు ఒక వ్యక్తి ఆదాయంలో 63 శాతం మించిపోయినప్పుడు అది భరించలేనిదిగా పరిగణించబడుతుంది. పేలవమైన ఆహారపు అలవాట్లు శ్వాసకోశ వ్యాధులు, మధుమేహం, కేన్సర్, గుండెపోటు, గుండెకు సంబంధించిన ఇతర వ్యాధులకు దారితీస్తాయని పేర్కొంది. ప్రపంచంలోనే భారత్ అత్యధిక యువశక్తి కలిగిన దేశమని, దీనిని సద్వినియోగం చేసుకుంటే అగ్రగామి దేశంగా మారగలుగుతామని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్పుకొచ్చారు. అయితే మోదీ పాలనలో దేశంలో నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ప్రపంచ సగటుతో పోల్చితే గత ఎనిమిదేళ్లలో ఇది ఏటా కనీసం మూడు రెట్లు అధికంగానే ఉంటున్నది. వినియోగదారుల ఆహార ధరల సూచీ ద్రవ్యోల్బణం గత సంవత్సరంలో 327 శాతం పెరిగింది. వినియోగదారు ధరల సూచిక-వినియోగదారు ఆహార ధరల సూచికను కలిగి ఉంటుంది. అదే కాలంలో 84 శాతం పెరిగింది. భారతదేశ వినియోగదారుల ధరల సూచీ లేదా రిటైల్ ద్రవ్యోల్బణం ఏప్రిల్‌లో ఎనిమిదేళ్ల గరిష్ఠ స్థాయి 7.79 శాతానికి చేరుకుంది. దీంతో పండ్లు, కూరగాయలు వంటి పోషకాహారం ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. దీనికితోడు గత ఎనిమిదేళ్లలో తలసరి ఆదాయం ఆశించినంతగా పెరగలేదు. 2014-15లో తలసరి ఆదాయం రూ.86,647 ఉండగా.. 2021 నాటికి రూ.1.28 లక్షలకు మాత్రమే పెరిగింది. ఇదే సమయంలో నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగాయి. 2020-2021 మధ్య పోల్చినప్పుడు నిత్యావసరాల ధరలు 84 శాతం పెరిగినట్టు నివేదికలు చెబుతున్నాయి. ఇదే సమయంలో తలసరి ఆదాయం రూ.1.34 లక్షల నుంచి రూ.1.28 లక్షలకు పడిపోయింది. అంటే.. ఆదాయం తగ్గింది, ధరలు పెరిగాయి. అవర్ వరల్డ్ సంస్థ 2017లో విడుదల చేసిన నివేదిక ప్రకారం దేశంలో 57.1 కోట్ల మంది కనీస పోషకాహారాన్ని కొనుగోలు చేయలేని స్థితిలో ఉన్నారు. అయితే తాజాగా దేశంలో సుమారు 71 శాతం మంది ప్రజలు పోషకాహారం కొనలేని స్థితిలో ఉన్నట్లు సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ వెల్లడించింది. నాలుగు సంవత్సరాల్లో దేశంలో పోషకాహారానికి దూరమైన వారి సంఖ్య 42 కోట్లకు పెరిగింది. అంటే ఏటా కనీసం 10 కోట్ల మంది పోషకాహారం కొనలేని స్థితికి దిగజారుతున్నారు. ఇదే సమయంలో ప్రపంచవ్యాప్తంగా పోషకాహారం అందనివారు 42 శాతం మంది ఉన్నారు. అంటే ప్రపంచ సగటుతో పోల్చితే మన దగ్గర సుమారు 30 శాతం మంది అధికంగా ఉన్నారు.

'నడ్డా' వ్యాఖ్యలన్నీ అబద్ధాలే

మాజీ మంత్రి పేర్ని నాని ధ్వజం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఢిల్లీ నుంచి వచ్చిన బీజేపీ నేత నడ్డా అబద్ధాలను మోసుకొచ్చారని మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) ఎద్దేవా చేశారు. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, నడ్డా ఏపీకి వచ్చేముందు ఆర్థిక మంత్రిని వివరాలు అడిగి తెలుసుకుని రావాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ అప్పులపై జేపీ నడ్డా అవాస్తవాలు చెప్పారు. పరిమితికి మించి అప్పులు చేస్తే కేంద్రం ఏం చేస్తోందని పేర్ని నాని నిలదీశారు. దేశ అప్పు రూ.130 లక్షల కోట్లకు చేర్చిన ఘనత బీజేపీదేనని, రూ.80 లక్షల కోట్ల అప్పులను చేసింది బీజేపీ ప్రభుత్వం అని పేర్కొన్నారు. ఇంటికో ఉద్యోగం ఇస్తానన్న మోదీ ఇచ్చారా?, ప్రతి ఖాతాలో 15 లక్షలు వేస్తామన్న హామీని నేరవేర్చారా? అని ప్రశ్నించారు. కులాలు, మతాల పేరుతో దేశంలో రాజకీయం చేస్తున్నది ఎవరని మండిపడ్డారు. ఈడీ, ఐటీ దాడులతో ప్రతిపక్షాలను బీజేపీ ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. రాష్ట్రానికి వచ్చిన నడ్డా పోలవరం ప్రాజెక్టుపై ఒక్కమాటైన చెప్పారా? అని ప్రశ్నించారు. ఆ ప్రాజెక్టు పెండింగ్ బిల్లులు ఎందుకు ఇవ్వలేదంటూ నిలదీశారు. ఆయుష్మాన్ భారత్ పుట్టకముందే, రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ ఉందంటూ గుర్తుచేశారు.

జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదులపై ఉక్కుపాదం

శ్రీనగర్ : పాకిస్తాన్‌లోని ఉగ్రవాద కమాండర్‌లతో సంప్రదింపులు జరుపుతున్నారనే ఆరోపణలపై జమ్మూకశ్మీర్‌లో జరిగిన దాడుల్లో డజనుకు పైగా వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని అధికారులు మంగళవారం తెలిపారు. స్థానిక హైబ్రిడ్ ఉగ్రవాదులను ఉపయోగించి ఈ కమాండర్ల ఆదేశాల మేరకు ఇటీవల అనేక లక్షిత హత్యలు, ఇతర ఉగ్రవాద నేరాలు జరిగాయని అన్నారు. 'జమ్మూకశ్మీర్ పోలీసులు అనేక మంది వ్యక్తులను చుట్టుముట్టారు. వారు పాకిస్తాన్ కేంద్రంగా ఉన్న తీవ్రవాద కమాండర్లతో సంబంధాలు కలిగి ఉన్నట్లు గుర్తించినందున వారిపై చట్టపరమైన చర్యలు ప్రారంభించారు' అని అధికారులు తెలిపారు.

మోదీ పాలనలో ఆర్థిక వ్యవస్థ పతనం

ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేశు

విశాలాంధ్ర- రైల్వేకోడూరు: దేశ ఆర్థిక వ్యవస్థను ప్రధాని మోదీ భ్రష్టు పట్టించారని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేశు విమర్శించారు. సీపీఐ కార్యాలయంలో ఓబులేశు మంగళవారం పాత్రికేయులతో మాట్లాడుతూ దేశాన్ని మోదీ అప్పులమయం చేస్తున్నారని మండిపడ్డారు. కేవలం 8 ఏళ్లలో 80 లక్షల కోట్ల రూపాయలు అప్పు చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థల న్నింటినీ కార్పొరేట్ సంస్థలకు తాకట్టు పెడుతున్నా రన్నారు. ఇప్పటి వరకు ప్రధానులుగా పనిచేసిన వారందరూ కొంత మేరకు ప్రభుత్వ రంగ సంస్థలను ఏర్పాటు చేయగా మోదీ మాత్రం ఒక్క సంస్థను స్థాపించలేదని ఓబులేశు వివరించారు. పైగా ప్రతిష్ఠాత్మక సంస్థలను తమ కార్పొరేట్ మిత్రులకు కట్టబెడుతున్నారని చెప్పారు. 32 మంది ప్రాణత్యాగాలతో సిద్ధించిన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పడానికి పూనుకున్నారన్నారు. 500 రోజులుగా విశాఖ ఉక్కు ఉద్యమం జరుగుతుంటే మోదీ సర్కారు కనీసం పట్టించు కోకపోవడం దారుణమన్నారు. గంగవరం పోర్టును అదానీకి కట్టబెట్టారు. దామోదర సంజీవయ్య విద్యుత్ థర్మల్ ప్రాజెక్టును 25 సంవత్సరాలకు లీజుకు ఇచ్చేశారు. కృష్ణపట్నం ఓడరేవు అప్పగించారు. రాష్ట్రంలోని ప్రతిష్ఠాత్మక ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వం అమ్ముకుంటుంటే...ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నోరు మెదపకపోవడం శోచనీయమన్నారు. తరచూ ఢిల్లీ వెళుతున్న జగన్ రాష్ట్ర ప్రయోజనాల కన్నా వ్యక్తి ప్రయోజ నాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని ఓబులేశు విమర్శించారు. కేసుల నుండి బయట పడడానికి ఢిల్లీ యాత్రలు చేస్తున్నా రని వ్యాఖ్యానించారు. ప్రత్యేకహోదా, కడప స్టీల్‌ప్లాంట్, సాగునీటి ప్రాజెక్టుల పూర్తి కోసం మోదీ సర్కారుపై జగన్ ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టుకు అవసరమైన నిధులు సైతం రాబట్టలేకపోతు న్నారని జగన్‌ను నిందించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలు, కార్మికులు, ఉద్యోగుల సమస్యలను పట్టించుకోవ దానికి బదులు కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేస్తున్నా యని విమర్శించారు. పెట్రో ధరలకు అంతే లేదన్నారు. నవరత్నాలపై జగన్ డొంక తిరుగుడు మాటలు మాట్లాడు తున్నారన్నారు. సీపీఎస్‌పై ఉద్యోగులను జగన్ మోసం చేశారన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి, సీపీఐ ఏరియా కార్యదర్శి టి రాధాకృష్ణ, సీనియర్ నాయకులు ఎస్.శంకరయ్య, ఏపీఎండీసీ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పోకూరు మురళి తదితరులు పాల్గొన్నారు.

ఆర్ అండ్ బీ ఖాళీ స్థలాలు లీజుకు..

తక్షణ చర్యలకు మంత్రి దాడిశెట్టి రాజా ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వాణిజ్య ప్రాంతాల్లో ఉన్న రోడ్లు, భవనాల శాఖకు చెందిన కాళీ స్థలాలను లీజుపై ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రామలింగేశ్వ రరావు (రాజా) అధికారులను ఆదేశించారు. మంగళ వారం అమరావతి సచివాలయంలో రోడ్లు, భవనాలు, జాతీయ రహదారులు, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొ రేషన్, విద్యుత్ శాఖ అధికారులతో మంత్రి సమా వేశమై రాష్ట్రంలో రోడ్లు, భవనాల నిర్వహణ పనుల ప్రగతిని సమీక్షించారు. ఈ సందర్బంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రోడ్లు, భవనాల శాఖకు చెందిన ఖాళీ స్థలాలు ఎన్నో ఉన్నాయని, అవి అన్యాక్రాంతానికి గురికాకుండా ఉండేందుకై వాటిని సత్వరమే వినియోగంలోకి తేవాలని అధికారులకు సూచించారు. విజయ నగరం, గుంటూరు, రాజమండ్రి తదితర ప్రాంతాల్లో ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో భవన నిర్మాణాలను ఇప్పటికే చేపట్టడం జరిగిందని, అదే తరహాలో మిగిలిన ప్రాంతాల్లో కూడా భవన నిర్మాణాలు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని, అలా కాని పక్షంలో ఆయా స్థలాలను లీజుపై వినియోగించుకునే విధంగా ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వాలన్నారు. తద్వారా రోడ్లు, భవనాల ఖాళీ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించుకునే అవకాశాలు ఏర్పడతాయన్నారు. రోడ్ల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, వాటి నాణ్యతలో ఎటు వంటి రాజీ లేకుండా చూడాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రగతిలోనున్న రోడ్ల నిర్మాణ పనులను పరిశీలించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా తాను స్వయంగా పర్యటిస్తానని అధికారులకు మంత్రి తెలిపారు. తమ పర్యటన ప్రారంభంలోపు ఇంజనీరింగ్ అధికారులు అంతా క్షేత్ర స్థాయిలో పర్యటించి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. రోడ్లు, భవనాల శాఖకు చెందిన అతిథి గృహాలకు చాలా చోట్ల వాచ్‌మెన్‌లు లేకపోవడం వల్ల వాటి నిర్వహణ అధ్వానంగా తయారయిం దని, అవుట్ సోర్సింగ్‌పై వారిని నియమించుకునేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. రోడ్ల మరమ్మత్తులు, నిర్వహణ పనులకు సంబంధించిన బిల్లులను సీఎఫ్ఎంఎస్ అప్‌లోడింగ్ చేయడంలో జరుగుతున్న జాప్యాన్ని నియంత్రించేందుకు తగు చర్యలు తీసుకోవాలని, సాధ్యమైనంత త్వరగా బిల్లుల అప్ లోడింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు మంత్రి సూచించారు. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ ఇ.ఎన్.సి.లు వేణుగోపాల రెడ్డి, నయీముల్లా, సీఈ రమేష్ కుమార్, ఏపీఆర్‌డీసీ సీఈ ఎల్.శ్రీనివాసరెడ్డి, జాతీయ రహదారుల అథారిటీ సీఈ రామచంద్రరావు, విద్యుత్ శాఖ సీఈ బుచ్చిరాజు తదితరులు ఈ సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు.

బీసీ కులగణన చేపట్టాలి

జేపీ నడ్డాకి బీసీ సంక్షేమ సంఘం వినతి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: బీసీ కుల గణన చేపట్టాలని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాకి విన్న వించినట్లు ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు మంగళ వారం తెలిపారు. విజయవాడలో బీసీ సంక్షేమ సంఘం నాయకులతో కలిసిన ఆయన... బీసీలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను నడ్డాకి వివరించినట్టు చెప్పారు. స్వాతంత్ర్యం రాకపూర్వం 2 దశాబ్దాలు, తర్వాత ఏడు దశబ్దాల పాటు జరిగిన జనాభా లెక్కల సేకరణలో కుల గణన జరగలేదని, ఇది బీసీ సామాజిక వర్గ అభివృద్ధికి విఘాతం కలిగించిందని నడ్డాకి వివరించినట్టు కేసన తెలిపారు. కుల జనగణనకు 20కి పైగా రాష్ట్రాలు సానుకూలంగా ఉన్నాయని వివరించారు. 2011న అప్పటి ప్రతిపక్ష నాయకుడు అరుణ్‌జైట్లీ బీసీ కుల జనగణ కోసం రాజ్య సభలో పట్టుబట్టగా, 2019లో రాజ్యసభ సాక్షిగా నాటి హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ 2021 జనాభా లెక్కల సేకరణలో ప్రత్యేక ఓబీసీ కాలమ్ ద్వారా బీసీ కుల జనగణన చేపడతామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. 2021 జనాభా లెక్కల్లో ఓబీసీ కాలమ్ ప్రతిపాదించి అనంతరం తొలగించడంతో బీసీ సామాజిక వర్గాలకు జరిగిన అన్యాయాన్ని కూలంకషంగా వివరించినట్టు తెలిపారు. ప్రత్యేక బీసీ మంత్రిత్వ శాఖ తదితర సమస్యలను నడ్డా దృష్టికి తీసుకొచ్చామని,ఈ సమస్యలను ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు. రాష్ట్ర యువజన అధ్యక్షుడు కుమ్మర క్రాంతికుమార్, ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు తదితరులు నడ్డాని కలిసిన వారిలో ఉన్నారు.

నేతల పనితీరులో మార్పు రావాలి

- పార్టీలో గ్రూపులు సరికాదు
- ప్రజా సమస్యలపై పోరాటాలే కనిపించాలి
- సమీక్షలో టీడీపీ ఇన్‌చార్జిలకు చంద్రబాబు హెచ్చరిక

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: నాయకుల పనితీరులో ఇకపై స్పష్టమైన మార్పు కనిపించాలని టీడీపీ అధినేత చంద్రబాబు స్పష్టం చేశారు. మహానాడు తరువాత పార్టీ పటిష్టత, ఇన్‌చార్జిల పనితీరుపై చంద్రబాబు వరుసగా సమీక్షలు మొదలు పెట్టారు. దీనిలో భాగంగా మంగళవారం ఉత్తరాం ధ్రలోని నాలుగు పార్లమెంట్‌ల పై అధినేత సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా పార్టీ నేతలకు మార్గనిర్దేశనం చేశారు. జిల్లా, నియోజకవర్గ స్థాయిలో పార్టీలో గ్రూపులు కనిపించకూడదని... ప్రజా సమస్యలపై నేతల పోరాటాలు, పార్టీ కార్యక్రమాలు మాత్రమే కనిపించాలని చంద్రబాబు అన్నారు. రోడ్డెక్కని నేతలు, పని చేయని నాయకుల విషయంలో ఉన్నది ఉన్నట్లు తనకు నివేదికల ద్వారా తెలపాలని పార్లమెంట్ కోఆర్డినేటర్లకు చంద్రబాబు సూచించారు. శ్రీకాకుళం-విజయ నగరం పార్లమెంట్ల కోఆర్డినేటర్‌గా ఉన్న ఎమ్మెల్యే గణబాబు, విశాఖ-అనకాపల్లి పార్లమెంట్ల కోఆర్డినే టర్‌గా ఉన్న మాజీ మంత్రి చినరాజప్పలతో చంద్ర బాబు విడివిడిగా సమీక్ష జరిపారు. అనంతరం జోన్-1 ఇన్‌చార్జి బుద్దా వెంకన్నతో సమీక్ష చేశారు. పార్టీ కార్యక్రమాల నిర్వహణలో అలసత్వం ప్రదర్శించే, పార్టీ కార్యకర్తలను పట్టించుకోని నేతల విషయంలో కఠిన నిర్ణయాలు ఉంటాయని చంద్రబాబు హెచ్చరించారు. నేతల పనితీరుపై లోతైన సమాచారంతో నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. 15 రోజుల పాటు పార్లమెంట్ కోఆర్డినేటర్లు క్షేత్ర స్థాయి పర్యటనలు చేయాలని సూచించారు. గ్రూపు రాజకీయాలతో పార్టీకి నష్టం చేసే వారిని ఉపేక్షించేది లేదని... ఇదే విషయాన్ని ఆయా నేతలకు అర్థం అయ్యేలా చెప్పాలన్నారు. ఇన్‌చార్జిల విషయంలో అంతిమంగా వారి పనితీరు మాత్రమే ప్రామాణికంగా ఉంటుందని చంద్రబాబు ఈ సందర్భంగా నేతలకు స్పష్టం చేశారు.

నాడు-నేడు అంటే 2 లక్షల మంది విద్యార్థులు ఫెయిల్ అవ్వడమేనా?

నాడు-నేడు అంటూ మూడేళ్లుగా ప్రభుత్వం చేసిన ఆర్భాటపు ప్రచారానికి, నిన్న వచ్చిన పదో తరగతి ఫలితాలకి పొంతనే లేదు. టీడీపీ హయాంలో 90-95 శాతం ఉన్న ఉత్తీర్ణత... ఇప్పుడు 67 శాతానికి పడిపోవడం రాష్ట్రంలో పాఠశాల విద్యా వ్యవస్థ దుస్థితికి నిదర్శనమని చంద్రబాబు విమర్శించారు. ఉపాధ్యాయ పోస్టుల భర్తీ లేకపోవడం, వారికి బోధనేతర పనులు అప్పగించడం, బడుల విలీనం సహా ప్రభుత్వం తీసుకున్న అనేక అస్తవ్యస్థ విధానాలే నేటి ఈ పరిస్థితికి కారణమన్నారు.

సీపీఎస్ రద్దు చేసి

ఓపీఎస్ అమలు చేయాల్సిందే

ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి

విశాలాంధ్ర-పోరుమామిళ్ల: ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల జీవితాలకు భద్రత లేకుండా చేసేలా ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన పెన్షన్ విధానం సీపీఎస్‌ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం ఓపీఎస్‌ని అమలు చేయాల్సిందేనని పశ్చిమ రాయల సీమ ఉపాధ్యాయ శాసనమండలి సభ్యులు కత్తి నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం పోరుమామిళ్లలోని నూతన ఎస్‌టీయూ భవన్‌లో నిర్వహించిన ప్రాంతీయ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కత్తి నరసింహారెడ్డి మాట్లా డుతూ అధికారంలోకి వచ్చిన వారంలో సీపీఎస్‌ని రద్దు చేస్తామని ప్రస్తుత ప్రభు త్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోకుండా కమిటీలతో కాలయాపన చేస్తోందని విమర్శించారు. సీపీఎస్ ఉద్యోగులను అభద్రతా భావంలోకి నెట్టేలా ప్రభుత్వం చేస్తున్న సాగదీత ధోరణి విరమించుకొని, సీపీఎస్‌ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం ప్రతిపాదించిన జీపీఎస్‌ని ఎటువంటి పరిస్థితులలోనూ అంగీకరించే ప్రసక్తి లేదని అన్నారు. అదేవిధంగా 292 ఉన్నత పాఠశాలల్లో ఇంటర్ మీడియట్ విద్యను ప్రవేశ పెడుతున్న దృష్ట్యా అర్హులయిన స్కూల్ అసిస్టెంట్లకు జూనియర్ లెక్చరర్‌గా పదోన్నతి ఇవ్వాలని, అర్హులయిన హెచ్‌ఎంలకు ప్రిన్సిపాల్స్‌గా పదోన్నతులు చేపట్టాలని కోరారు. రాష్ట్ర నాయకులు కె.బాలగంగిరెడ్డి, ఆర్.గురుకుమార్ మాట్లాడుతూ ఎన్‌ఈపీ అమలులో భాగంగా చేపడుతున్న పాఠశాలల విలీన ప్రక్రియ కారణంగా ప్రాథమిక విద్యా వ్యవస్థ దెబ్బతిని పిల్లలు విద్యకు దూరమై, బడిబయట పిల్లలుగా మారే ప్రమాదం ఉందని తెలిపారు. ఉపాధ్యాయులను విద్యకు దూరం చేస్తున్న యాప్‌ల గోల, ఆన్‌లైన్ ప్రక్రియలను ఉపసంహరించు కోకపోతే విద్యాప్రమాణాలు దెబ్బతినే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన, ఆర్థిక కార్యదర్శులు పి.రమణారెడ్డి, జి.చెన్నకేశవరెడ్డి, ఎస్.మహబూబ్ బాషా, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి.బాలరాజు, వి.చంద్రశేఖర్, సి.రామచంద్రారెడ్డి, ఎం.రామకృష్ణారెడ్డి, రీజనల్ కన్వీనర్, కోకన్వీనర్ కె.పుల్లయ్య, కె.వెంకటసుబ్బయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు కె.ప్రసాద్, టి.వెంకట సుబ్బయ్య, మండల శాఖల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.వి.కృష్ణారెడ్డి, సత్యనారాయణ, సుబ్రహ్మణ్యం, కుమార్ బాబు, ఆనంద్, వెంకటరెడ్డి రఘురామిరెడ్డి, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మోటార్లకు మీటర్లను వ్యతిరేకిద్దాం

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జగదీశ్

విశాలాంధ్ర-గుంతకల్లు: ప్రధాని నరేంద్ర మోదీకి తలొగ్గి రాష్ట్రంలో వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించడానికి సీఎం జగన్ ముందుకొచ్చారని సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు డి.జగదీశ్ విమర్శించారు. మోటార్లకు మీటర్లు బిగించడం ద్వారా రైతుల మెడకు ఉరితాడు వేయడానికి జగన్ ప్రయత్నిస్తున్నారని అన్నారు. జగన్ ప్రభుత్వ నిర్ణయాన్ని రైతులందరూ వ్యతిరేకించా లని, పొలాల్లో బిగించే మోటార్లను పగల గొట్టాలని జగదీశ్ పిలుపునిచ్చారు. పట్టణంలోని బీరప్ప గుడిలో సీపీఐ అధ్వర్యంలో రైతుసదస్సు మంగళవారం జరి గింది. జగదీశ్ మాట్లాడుతూ అప్పులు కావాలంటే రైతులకు ఉచిత కరెంటు ఇవ్వకూడదని మోదీ షరతు విధించారని, ఈ మేరకు కేంద్రంతో జగన్ ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు. బీజేపీ పాలిత రాష్ట్రం లోనూ 'మోటార్లకు మీటర్ల'ను అమలు చేయలేదని గుర్తు చేశారు. కర్ణాటక, ఉత్తరప్రదేశ్, బీహార్ తదితర బీజేపీ పాలిత 12 రాష్ట్రాల్లో మోటార్లకు మీటర్లు అమలు చేయడం లేదని, సీఎం జగన్ మాత్రమే కేంద్రం చెప్పి నట్లు వింటున్నదని ఆరోపించారు. అనంతపురం జిల్లాలో పంపుసెట్లకు మూడు మీటర్లు బిగించుకోవాల్సి ఉంటుంది. అందులో ఒక్క మీటర్‌కు మాత్రమే ప్రభుత్వం ఆరు నెలలు, ఏడాది పాటు బిల్లు భరిస్తుం దని, తర్వాత మంగళం పాడుతుందని హెచ్చరించారు. మీటర్లు బిగిస్తే నెలకు ఐదు వేల నుండి ఆరు వేల రూపాయల వరకు బిల్లు వస్తుందని, ఏడాదికి 70 వేల రూపాయలు ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుందని తెలియజేశారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించ డాన్ని రైతులంతా ముక్తకంఠంతో వ్యతిరేకిం చాలని జగదీశ్ విజ్ఞప్తి చేశారు. రైతులందరూ ఇది గమనిం చాలని దీనిపై పెద్ద ఎత్తున జిల్లావ్యాప్తంగా రాష్ట్ర వ్యాప్తంగా రైతులు నష్టపోకుండా మోసపోకుండా ఉండేం దుకు రైతులందరూ మోటార్లకు మీటర్లు బిగించడాన్ని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. అన్ని రైతు సంఘాలు మీటర్ల బిగింపును వ్యతిరేకిం చాలని విన్నవించారు. సీపీఐ పట్టణ కార్యదర్శి గోపీనాథ్, రూరల్ కార్యదర్శి రాము రాయల్, జిల్లా సమితి సభ్యులు వీరభద్రస్వామి, ఏఐటీ యూసీ జిల్లా సహాయ కార్యదర్శి బి.మహేశ్, నాయకులు దేవేంద్ర, రామాంజనేయులు, సురేశ్, మక్బూల్ బాషా, ఉమర్ బాషా, ప్రసాద్‌రెడ్డి, మల్లయ్య, మురళీకృష్ణ, వెంకట్ నాయక్, వినోద్, రైతులు పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతికి ముందే

125 అడుగుల విగ్రహ నిర్మాణం

సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగు నాగార్జున

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ విగ్రహ నిర్మాణ పనులను రాబోయే ఆయన జయంతికి ముందుగానే పూర్తి చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగు నాగార్జున ఆదేశించారు. రాష్ట్ర మంత్రులు, అధికారులతో కూడిన 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు కమిటీ మంగళవారం తాడేపల్లిలోని ఎస్సీ గురుకులం ప్రధాన కార్యాలయంలో సమీక్షించింది. మేరుగు నాగార్జున, ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఈ సమావేశానికి హాజరు కాగా, పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ వర్చు వల్‌గా హాజరయ్యారు. మేరుగు నాగార్జున మాట్లాడుతూ, ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్ణీత సమయానికి విగ్రహాన్ని ఆవిష్కరించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాబోయే అంబేద్కర్ జయంతి నాటికి 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించాలనే లక్ష్యంతో సీఎం జగన్ ఉన్నారని స్పష్టం చేశారు. అంబేద్కర్ జయంతి అంటే ఏప్రిల్ 14 వరకూ గడువు ఉందనీ, విగ్రహనిర్మాణ పనుల్లో జాప్యం చేయకుండా గడువుకు ముందుగానే విగ్రహ ఆవిష్కరణ పనులను పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. అణువణువూ సహజ త్వం ఉట్టి పడేలా విగ్రహాన్ని రూపొందించాలని, అంబేద్కర్ ముఖాకృతి తీర్చిదిద్దే విషయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ, అంబేద్కర్ విగ్రహానికి సంబం ధించి 12.5 అడుగులు, 25 అడుగుల నమూనా విగ్రహాల్లో కమిటీ సూచించిన మార్పులన్నీ చేయాలని సూచించారు. కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ, అంబేద్కర్ జయంతి నాటికి విగ్రహం ఏర్పాటు చేయ డంలో ఎలాంటి ఆలస్యం లేకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమశాఖ కార్యదర్శి ఎంఎం నాయక్, డైరెక్టర్ హర్షవర్ధన్‌తో పాటుగా ఏపీఐఐసీ, కేపీసీలకు చెందిన అధికారులు పాల్గొనగా, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు వర్చువల్‌గా హాజరయ్యారు.

ఏ ఉద్యోగి సంతోషంగా లేరు

టీడీపీ ఎమ్మెల్సీ అశోక్‌బాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో ఏ ఉద్యోగి సంతోషంగా లేదని టీడీపీ ఎమ్మెల్సీ పర్చూరి అశోక్‌బాబు అన్నారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరిస్థితి దయనీయంగా మారిందని, రెగ్యులర్, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఇలా ఏ ఉద్యోగి కూడా సంతోషంగా లేరన్నారు. నాయకత్వం పూర్తిగా విఫలమైందని, 13 లక్షల 42 వేల మంది ఉద్యోగుల పరిస్థితి ఎవరికీ చెప్పుకోలేనిదిగా మారిందని పేర్కొన్నారు. 70 ఏళ్లు దాటినవారికి అదనపు కోటా పెన్షన్ తొలగించడం అన్యాయమన్నారు. తమ జీవితాలు బాగుపడతా యనే ఉద్దేశంతో ప్రభుత్వంలో చేరిన ఆర్టీసీ ఉద్యోగులకు రివర్స్ పీఆర్సీ ఇవ్వడం బాధాకరమని, జాతీయ విద్యా ప్రమాణాల ప్రకారం ఉపాధ్యాయులు, విద్యార్థుల శాతం ఉండాలన్నారు.

సీఐడీ కక్ష సాధింపు: వర్ల రామయ్య

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రతిపక్ష పార్టీలపై సీఐడీ అధికారులు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. అధికార పార్టీ నేతలు కక్ష తీర్చుకునే ప్రక్రియలో ఏపీ సీఐడీ ఒక పావుగా ఉపయోగపడు తోందన్నారు. పరిష్కారం దొరకని కేసులను చేదించాల్సిన సీఐడీ బేల చూపులు చూస్తోందన్నారు. లోకల్ పోలీసులతో దర్యాప్తు చేసి కేసుల అంతు తేల్చాల్సిన సీఐడీ నిర్లిప్తంగా ఉందన్నారు. సీఎం జగన్, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి చేతిలో సీఐడీ వ్యవస్థ ఒక పావుగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సజ్జల అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నార న్నారు. సీఐడీ మంచిగానే నడుచుకుంటోందని చెప్పే ధైర్యం సీఎంకు లేదన్నారు.

పది పరీక్షల ఫలితాలపై చర్చించాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పది పరీక్షల విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఉత్తీర్ణులు కాకపోవడంపై ఉపాధ్యాయ సంఘాలు, ఎమ్మెల్సీలతో చర్చించి భవిష్య త్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, ఈ ఏడాది వివిధ కారణాలతో విద్యార్థులు అసౌకర్యానికి గురయ్యార న్నారు. కరోనా ఒకవైపు, సకాలంలో స్కూళ్లు, తెరుచు కోకపోవటం, తగినంత మంది ఉపాధ్యాయులు లేకపో వడం, సిలబస్ పూర్తి కాకపోవడం, అన్నిటికన్నా మించి పరీక్ష పేపర్ లీక్‌లతో విద్యార్థులు ఆందోళనకు గుర య్యారని పేర్కొన్నారు. దీని ప్రభావం ఫలితాల మీద కన్పిస్తోందన్నారు. ఈ పరిస్థితికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండు చేశారు. మేధావులు, విద్యా వేత్తలు, విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలతో ఈ ఫలితాలు, వాటికి గల కారణాల గురించి చర్చించి భవిష్యత్తులో ఇలా జరుగకుండా రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు.

విద్యా రంగం వైఫల్యం: శైలజానాథ్

జగన్ ప్రభుత్వ హయాంలో విద్యారంగం పూర్తిగా వైఫల్యం చెందిందని రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు సాకే శైలజానాథ్ విమర్శించారు. పది పరీక్షలు 67.26 శాతానికి పడిపోయాయని పేర్కొన్నారు. జగన్ ప్రభు త్వం ఇంతవరకూ ఒక్క డీఎస్సీ ఇవ్వలేకపోయిందని, ఉపాధ్యాయ నియామకాలు చేపట్టలేదన్నారు. రెండు లక్షల మందికిపైగా పది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించ లేకపోవడం ముమ్మాటికీ జగన్ ప్రభుత్వ వైఫల్యమే నన్నారు. విద్యాశాఖామంత్రి విద్యార్థుల ఫలితాలు ఆలస్యం చేసి అపహాస్యం చేశారన్నారని విమర్శించారు.

పది పరీక్షల్లో ప్రభుత్వ వైఫల్యం: టీడీపీ నేత ధూళిపాళ్ల నరేంద్ర కుమార్

పది పరీక్షా ఫలితాల్లో జగన్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని టీడీపీ మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ విమర్శించారు. మంగళవారం ఆయన టీడీపీ జాతీయ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వం విద్యావ్యవస్థని సర్వనా శనం చేసిందన్నారు. పది ఫలితాల విషయంలో దశాబ్ద కాలంలో ఇంతటి వైఫల్యం ఎప్పుడూ జరగలేదని, ఇందుకు విద్యామంత్రి నైతిక బాధ్యత వహించకుండా తల్లితండ్రులపైకి నెట్టడం మంత్రి చేతకానితనాన్ని సూచి స్తోందన్నారు. కరోనా సమయంలో ఇతర రాష్ట్రాలు విద్యా ప్రమాణాలు పెంచాలని ప్రయత్నించి, డిజిటల్ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టాయని పేర్కొన్నారు. విద్యార్థులను ఇంగ్లీష్ మీడియంలో చేరాలని బలవంత పెట్టడం దారుణమన్నారు. ఐటీ రంగంలో తెలుగువారు ముందుండడం చంద్రబాబు ఘనతేనన్నారు. ఈ విధానాలతో రాబోయే రోజుల్లో విద్యారంగ వ్యవస్థపై తీవ్ర ప్రభావం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. పేద, మధ్య తరగతి విద్యార్థులను విద్యకు దూరం చేస్తోందన్నారు. గత ప్రభుత్వాలు విద్యా వ్యవస్థను మెరుగుపరచడానికి వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తే ఈ ప్రభుత్వం విద్య పేరుతో కోట్లాది రూపాయలు దోచుకుంటోందని విమర్శించారు.

ఫలితాలు ఆందోళనకరం: బాబ్జి

విశాలాంధ్ర-విజయనగరం క్రైమ్: పదో తరగతి ఫలితాలతో రాష్ట్ర ప్రజలు బిత్తరపోయారని, రాష్ట్ర విభజన తర్వాత ఇటు వంటి ఫలితాలు ఏనాడు రాలేదని, దీనికి విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఉన్నత అధికారులు ప్రజలకి సమాధానం చెప్పాలని లోక్ సత్తాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి డిమాండ్ చేశారు. జిల్లా పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 6,15,908 మంది పరీక్షలు రాస్తే 2,01,627 మంది ఉత్తీర్ణులు కాకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర మానసిక ఒత్తిడిలో ఉన్నారన్నారు. 67.26 శాతం మాత్రమే ఉత్తీర్ణత కావడంతో ఉపాధ్యాయుల మనో నిబ్బరం దెబ్బతిందని, ప్రభుత్వం తీవ్రంగా పరిగ ణించకపోతే ప్రమాదమన్నారు. 2019లో సున్నా ఫలితాలు వచ్చిన ప్రభుత్వ బడి ఒక్కటీ లేదన్నారు. రెండేళ్లలో ఇటువంటి పరిస్థితి రావడానికి కారణమే మిటని ప్రశ్నించారు. ఉపాధ్యాయుల కొరతా? కరోనా ప్రభావమా వంటి అంశాలను పరిశీలించాలన్నారు. పదో తరగతి ఫలితాలు ఒకవైపు ఆందోళన కలిగిస్తుంటే మరోవైపు ఆ జాబితాలు తప్పులతో ఉండటం హాస్యాస్పదంగా ఉందని వ్యాఖ్యానించారు.

ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం

కౌన్సిల్ సమావేశం రేపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర గుర్తింపు పొందిన సివిల్ సర్వీసెస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో సభ్యత్వం కలిగిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రెండవ కౌన్సిల్ సమావేశం ఈ నెల 9వ తేదీ గురువారం విజయవాడ లోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కేఆర్ సూర్యనారాయణ, జి.అప్పారావు మంగళవారం ఒక ప్రక టనలో తెలిపారు. సమావేశానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర మంత్రులు బొత్స సత్య నారాయణ, బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, ఆదిమూలపు సురేశ్, జోగి రమేశ్, ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డి, అజేయ కల్లామ్, ఆర్థికశాఖ ముఖ్య కార్య దర్శులు హాజరవుతారని తెలిపారు. సంఘం నియమావళి ప్రకారం ప్రతి మూడేళ్ల కోసారి రాష్ట్ర కౌన్సిల్ సమావేశం, ఎన్నికల ప్రక్రియను నిర్వహిస్తామని తెలిపారు.

మంత్రి అంబటిపై సీఐడీకి ఉమా ఫిర్యాదు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: తనపై తప్పుడు ట్వీట్ చేశారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబుపై మాజీ మంత్రి దేవినేని ఉమా మంగళవారం సీఐడీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలోనే ఆయన మంగళగిరిలోని సీఐడీ ప్రధాన కార్యాలయానికి వెళ్లారు. అసత్య ఆరోపణలు చేశా రని ఫిర్యాదులో పేర్కొన్నారు. సీఐడీ కార్యాలయానికి వెళుతున్న దేవినేని ఉమను పోలీసులు అడ్డుకున్నారు. కేవలం ఒక్కరు మాత్రమే వెళ్లాలని షరతు విధించారు. దీంతో ఆయన ఒక్కరే ఫిర్యాదు కాపీతో లోపలికి వెళ్లి ఫిర్యాదు చేశారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను ఉద్దేశించి తాను పోస్టు పెట్టకుండానే ట్వీట్ పెట్టినట్లుగా సృష్టించి దానికి మంత్రి అంబటి రాంబాబు కౌంటర్ ఇచ్చారని, తర్వాత ట్వీట్ డిలీట్ చేశారని సీఐడీకి ఫిర్యాదు చేశారు. తన అకౌంట్ హ్యాక్ చేసిన అంబటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు ఆయన అంబటి రాంబాబు తన అకౌంట్ హ్యాక్ చెసి పెట్టిన ట్వీట్ స్క్రీన్ షాట్ కాపీని కూడా సీఐడీకి అందజేశారు.

సంపాదకీయం

నిరాశ మిగిల్చిన పదో తరగతి పరీక్షా ఫలితాలు

ఆంధ్రప్రదేశ్‌లో పదో తరగతి (ఎస్.ఎస్.సి) పరీక్షా ఫలితాలు అందరినీ నిరాశ పరిచాయి. కరోనా కారణంగా రెండేళ్ల పాటు అంటే 2019-2020, 2020-2021 విద్యా సంవత్సరాలకు పదో తరగతి పరీక్షలే నిర్వహించలేదు. పరీక్షలు నిర్వహించకపోతే అందరూ పై మెట్టు ఎక్కేస్తారు కనక ఉత్తీర్ణత, వైఫల్యం అన్న గొడవే ఉండదు. ఈ ఏడాది నిర్వహిస్తే నిరుత్సాహపూరితమైన ఫలితాలు వచ్చాయి. మొత్తం ఆరు లక్షల 15 వేల మంది పదో తరగతి పరీక్షలు రాస్తే 67.26 శాతం మంది మాత్రమే గట్టెక్కారు. మొత్తం 6,15, 908 మంది పదో తరగతి పరీక్ష రాస్తే 4,14,281 మంది మాత్రమే ఉత్తీర్ణులు కావడంతో ప్రభుత్వ పని తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పరీక్ష గట్టెక్కిన వారిలో 3.17 లక్షల మంది మొదటి శ్రేణిలో ఉత్తీర్ణులు కావడం ఆశాజనకమే. అంటే బాగా చేదివే వారి సంఖ్య ప్రోత్సాహకరంగానే ఉన్నట్టు. 69,597 మంది ద్వితీయ శ్రేణిలో, 26,895 మంది తృతీయ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. మిగిలిన రెండు లక్షల పై చిలుకు మంది అంటే 32.7 శాతం మంది పరీక్ష తప్పారు. సాధించిన ఫలితాలను బట్టి చూస్తే అబ్బాయిలకంటే అమ్మాయిలే బాగా చదివినట్టు. పరీక్షకు హాజరైన బాలురలో 64.02 శాతం మంది మాత్రమే సఫలమైతే బాలికల్లో 2,11,380 లేదా 70.70 శాతం మంది ఉత్తీర్ణులై పై చేయి సాధించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణతా శాతం కేవలం 50.11 శాతమే. అంటే ప్రభుత్వ పాఠశాలలు నాసిరకంగా ఉన్నాయనుకోవలసి వస్తుంది. అయితే ప్రభుత్వ పాఠశాలలు 11,671 ఉంటే ప్రైవేటు పాఠశాలలు 16 వేలకు పైగా ఉన్నాయి. చాలా గొప్పగా ఉంటాయనుకున్న ప్రైవేటు పాఠశాలలూ వైఫల్యంలో ఏ మాత్రం వెనుకబడి లేవు. వెరసి మన విద్యావ్యవస్థే దిగజారింది. విచిత్రం ఏమిటంటే మాతృభాషలో విద్యాబోధన మెరుగు అని అనేక శాస్త్రీయ పరిశోధనల్లో రుజువైంది. విద్యా రంగ నిపుణులదీ అదే అభిప్రాయం. కానీ ఇంగ్లీషు మాధ్యమంలో చదివిన వారు 77.55 శాతం ఉత్తీర్ణులైతే తెలుగు మాధ్యమంలో చదివిన వారిలో పరీక్ష గట్టెక్కింది కేవలం 43.97 శాతమే. ఇంగ్లీషు మాధ్యమం ప్రవేశ పెట్టాలన్న ప్రభుత్వ తహతహకు ఇది ఊతం ఇస్తుందనుకుని సరిపెట్టుకోవాలేమో! కరోనా కాలంలో పరీక్షలు నిర్వహించలేదు కనక 94.88 శాతం మంది ఏ పరీక్షా ఎదుర్కోకుండానే ఉత్తీర్ణులయ్యారు. అనంతపురం జిల్లా వెనుకబడిందన్న అభిప్రాయం మార లేదు కనక అక్కడ ఉత్తీర్ణులైన వారు 49.7 శాతమే. అయితే ప్రకాశం జిల్లా అభివృద్ధి పథంలో పరుగులు పెట్టకపోయినా అక్కడ మిగతా జిల్లాలకన్నా అత్యధికంగా 78.30 శాతం మంది ఉత్తీర్ణులు అయ్యారు. ప్రకాశం జిల్లా అనంతపురం జిల్లా కంటే అంత ఎక్కువగా అభివృద్ధి చెందిందేమీ కాదు. అయినప్పటికీ ఉత్తీర్ణతలో మొదటిస్థానంలో ఉన్నది. అనంతపురం ఉత్తీర్ణతా శాతం అతి తక్కువగా ఉన్నది. కారణాలు ఏమిటో అన్వేషించవలసిందే.

2018లో 94.48 శాతం, 2017లో 91.92 శాతం, 2016లో 94.52 శాతం, 2015లో 91.41 శాతం ఉత్తీర్ణులయ్యారు కనక తమ ఏలుబడిలో అద్భుతమైన ఫలితాలు సాధించామనీ, జగన్ ఏలుబడిలో విద్యా రంగం నాశనం అయిపోయిందన్న విమర్శలకు అవకాశం వచ్చింది. జగన్ అధికారంలోకి వచ్చిన మొదటి రెండేళ్లలో పరీక్షలే లేవు. మూడో ఏట దారుణమైన ఫలితాలు వచ్చాయి. కరోనా కారణంగా చదువులు దెబ్బ తిన్నందువల్లే ఇంత హీనమైన ఫలితాలొచ్చాయని విద్యా శాఖ నిర్వహిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ సమర్థించుకుంటున్నారు. కరోనా సమయంలో ఆన్ లైన్ బోధన పేరుకు మాత్రమే సాగిందన్న వాస్తవం జోలికి ఆయన వెళ్లలేదు. ఆన్ లైన్ తరగతులు నిర్వహించడానికి తగిన మౌలిక వసతులున్నాయా లేదా, అంతర్జాలం ఎంత మందికి అందుబాటులో ఉంది అన్న ప్రాథమిక అవగాహన లేకుండానే ఆన్ లైన్ తరగతులు నిర్వహించి ఓ పని అయిపోయిందనిపించారు. 90 శాతం పైగా ఫలితాలు సాధించామనుకుంటున్న సంవత్సరాలలో విద్యా ప్రమాణాలు మెరుగ్గా ఉన్నాయనుకుని సంతృప్తి పడదామనుకుంటే దానికీ అవకాశం కనిపించడం లేదు. ఒక్క ఉదాహరణ చాలు. ఒక విద్యార్థికి 420 మార్కులు వచ్చాయి. కానీ లెక్కల్లో తప్పినందువల్ల పరీక్ష తప్పాడు. మొత్తం 210 మార్కులే వచ్చినా అన్ని సబ్జెక్టుల్లో పాస్ మార్కులు సంపాదించినందువల్ల పరీక్ష పాసైనట్టు లెక్క. మరి ఇలాంటి విద్యార్థుల చదువుకు సంబంధించిన ప్రమాణాలు అద్భుతం అని సంతోషించడానికి వీలు లేదన్నది వాస్తవం. అంటే పరీక్షా విధానంలోనూ లోపం ఉంది. మరో వేపు ప్రభుత్వం నిర్వహిస్తున్న ఏ.పి. రెసిడెన్షియల్ పాఠశాలలు అద్భుతమైన ఫలితాలు సాధించాయి. ఈ పాఠశాలల్లో 91.10 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. మరో వేపు అదే ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణతా శాతం మరీ నాసి రకంగా 50.10 శాతమే ఉంది. అంటే ప్రభుత్వం ఉత్తమ పాఠశాలలతో పాటు అధమ పాఠశాలలు కూడా నిర్వహిస్తుందనుకోవాలా? ఈ వైపరీత్యం గురించి ప్రభుత్వంలో బాధ్యతాయుతమైన మంత్రులుగానీ, ఉన్నతాధికారులుగానీ ఒక్క క్షణమైనా ఆగి ఆలోచించరా? 11,671 పాఠశాలల తరఫున విద్యార్థులు పరీక్షలకు హాజరైతే 797 పాఠశాలల్లో చదివిన వారు వంద శాతం ఉత్తీర్ణులైతే 71 పాఠశాలల్లో చదివిన వారిలో ఒక్కరూ గట్టెక్కలేదు. ఈ 71 పాఠశాలల్లో 31 ప్రైవేటు పాఠశాలలూ ఉన్నాయి. అంటే ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే నాసి రకం ఫలితాలు వస్తాయి అనుకోవడానికి వీలు లేదు. మంచి, చెడు పాఠశాలల్లో ప్రభుత్వ, ప్రైవేటూ పాఠశాలలు ఉన్నాయి. ప్రైవేటు పాఠశాలల్లోనే చదువు బాగుంటుంది అనుకోవడానికి వీలు లేదని ప్రైవేటు పాఠశాలల వైఫల్యం నిరూపిస్తోంది. ఏ పాఠశాల అయినా నిర్వహణలో తేడా ఉండొచ్చు కానీ పాఠ్య ప్రణాళిక ప్రభుత్వం నిర్దేశించిందే ఉంటుంది. తేడా ఎక్కడో ఉందని ఎప్పటికి గ్రహిస్తామో! కేరళలో ప్రభుత్వ పాఠశాలలకే ఎక్కువ గిరాకీ అన్న విషయం ప్రభుత్వాలూ చెప్పవు. తల్లిదండ్రులూ గుర్తించరు. మొత్తం విద్యారంగాన్ని ప్రైవేటు రంగానికి అప్పగించి చేతులు కడిగేసుకోవాలన్న విధానాలది పై చేయి అయినంతకాలం ఫలితాలు ప్రమాణాలకు ఆధారం కాలేవు. చాలా మంది విద్యార్థులు గణితం, సైన్సు, సాంఘిక శాస్త్రంలో గట్టెక్కలేక పోయారు. సహజంగానే ప్రతిపక్షాలు వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం మీద విమర్శలు గుప్పిస్తున్నాయి. విద్యా బోధన నూతన రీతిలో ఉండాలని నమ్మి పాఠశాలలు నిర్వహిస్తున్న వారు చాలా మందే ఉన్నారు. ఆ పాఠశాలలు ప్రైవేటువే అయినా అవి సగటు ప్రైవేటు పాఠశాలలు కావు. వాటిల్లో విద్య అభ్యసించే వారిలో సమగ్రమైన అవగాహన కనిపిస్తోంది. దానికి మించి సర్వసమగ్రమైన అవగాహన, హేతుబద్ధంగా ఆలోచించడం నేర్చుకోగలుగుతున్నారు. ఇలాంటి పాఠశాలలు ఎందుకు మెరుగ్గా ఉన్నాయో ఆలోచించే తీరిక ఏ ప్రభుత్వానికీ లేదుగా! లోతుల్లోకి వెళ్లి సమస్యలను గుర్తించే ప్రయత్నం చేస్తే తప్ప వచ్చే ఏడాదైనా మెరుగైన ఫలితాలు సాధించలేం. ఫలితాలతో పాటు ప్రమాణాలూ ప్రధానం అన్న స్పృహ ఉండాలి.

బావ మనం ఎటు పోతున్నాం?

బండారు రాధాకృష్ణ

రా బావా! ఏమిటి మరీ నా మీద శీతకన్ను వేశావ్. అమ్మాయి దగ్గరికి హైదరాబాద్ వెళ్లావా! అబ్బే అదేం లేదు బావా ఈ ఎండలకు బయటకు రాలేకపోతున్నా. పార్వతి మీ అన్నయ్య వచ్చాడు. కాఫీ పట్రా. చెప్పు బావా ఏంటి కబుర్లు. కబుర్లకేముంది బావా వారం రోజుల నుండి పేపర్లు చూస్తుంటే మన సమాజం పయనం ఎటువైపు అడుగులేస్తోందని బాధగా ఉంది బావా. ఎందుకనిపించింది బావా అలా. ఎందుకంటావేంటి బావా మగ నాయకులు బోరున ఏడుస్తుంటే ఆడ నాయకులు తొడ కొడ్తున్నారు. సమస్య సాధనకు ఆ రెండూ మార్గాలు కాదు కదా. అసలు వైసిపి, తెలుగుదేశం నాయకులు ఒకర్ని ఒకరు తిట్టుకునే తిట్లు వింటుంటే జుగుప్స కలుగుతోంది. ఇలాంటివి గతంలో ఎప్పుడూ వినలేదు. వాటి అర్థాల కోసం వారే ఒక నిఘంటువు తయారు చేయాలన్నట్లుగా ఉన్నాయి. నిజమే బావా! వాళ్లు తిట్టుకోవడంతో పాటు యింట్లో ఆడవాళ్లను కూడా బజారుకీడవటం చాలా తప్పు. ఎందుకిలా దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారో అర్థం కావడం లేదు. అది సరే బావా విశ్వహిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్ వాళ్ల సలహాలు మోదీ పాటించవల సిందేనా. మసీదు పడగొట్టి రామాలయం అన్నారు. మరల ఇపుడు తాజ్ మహల్ అడుగున ఏదో ఉందంటారు. కుతుబ్‌మీనార్ పైన చివరకు కాశి సహా అన్ని పెకలించి పడగొట్టాలంటారు ఏంటి బావా. ఏముంది బావా బుద్ధిజానికి మించిన మానవతావాదం ఎందులోనూ కనబడదు. చివరకు మార్చ్సుకు కూడా అది ఆరాధ్యమే. కాని హిందూ మతోద్ధారకులు బుద్ధుడు నిర్మించిన వాటన్నిటిని పడగొట్టి వాటిపైన రామాలయాలు నిర్మించారు. తరవాత ముస్లిం రాజులు వాటిని పడగొట్టి మసీదులు నిర్మించారు. మరల యిపుడు వాటిని పడగొట్టి దేశమంతా రామాలయాలు నిర్మించాలని బి.జె.పి యోచన. ఇదేనా అభివృద్ధి. అది తప్పు కదా. వాటి వల్ల మత కలహాలు ప్రబలవచ్చు కదా. వాటిని పడగొట్టే బదులు కావలసినంత స్థలం ఉంది వేరేచోట నిర్మించుకోవచ్చు గదా.

అవును బావా పి.వి.నరసింహారావు ఆ మాటే అయోధ్య విషయంలో అని కొంత ఆపగలిగాడు. ఆయన తరవాత వాళ్ల ప్రభుత్వమే వచ్చింది. యిపుడు ఆపగలిగే వారెవరున్నారు. అంతేకాదు బావా పాఠశాలల్లో సిలబస్ మార్చేస్తున్నారు. గురుకుల విద్యా బోధన లాగా అయ్యవారు చెప్పిన శ్లోకాలు వల్లె వేసి నేర్చుకున్న తరవాత వాళ్లని ఉపాధ్యాయులుగా నియమిస్తారట. వేదం, ఉపనిషత్తులు వల్లె వేస్తున్నారు. ఉపాధ్యాయులుగా పిల్లలకు పాఠశాలలో నేర్పాలట. మొత్తం మనుధర్మ శాస్త్రాన్ని తెచ్చి పాలన చేసే ఉద్దేశంలో బి.జె.పి ఉన్నట్లు ఒకరిద్దరు బి.జె.పి యంపిలు బాహాటంగానే చెబుతున్నారు. ఇదేమి న్యాయం బావా మన కంటే మూడేళ్లు తరవాత స్వాతంత్ర్యం వచ్చిన చైనా... సామ్రాజ్యవాద దేశమైన అమెరికాను ఢీ కొట్టే స్థితిలో ఉంటే మన దేశంలో అభివృద్ధి కనబడటం లేదు కదా. అదేంటి బావా కుల మతాలను పోషించి అభివృద్ధి చేస్తోంది కదా! కులమతాలను రాజకీయంలో ప్రవేశపెట్టి ఎవరి మతస్థులను, ఎవరి కులస్థులను వారు రెచ్చగొట్టి వారి ఓట్లతో పబ్బం గడుపుకొంటున్నారు కదా.

దేశం అభివృద్ధి చెందడమంటే అట్టడుగు ప్రజల జీవన ప్రమాణం పెంచి ఆర్థికంగా, రాజకీయంగా సమాన హక్కులతో సమ సమాజం ఏర్పాటు చేయడం కదా బావ. దాదాపు రెండున్నర శతాబ్దాలు బ్రిటీషు వారు మన సొమ్ము దోచుకుంటూ మనల్ని కుక్కల కంటే హీనంగా చూస్తుంటే కదా మన నాయకులు వేలాది మంది ప్రాణాలర్పించి స్వాతంత్ర్యం సాధించుకున్నారు. నిజమే ప్రస్తుతం ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా పిలుస్తున్న మన దేశాన్ని అప్రజాస్వామ్యంగా మార్చి రాజుల పాలన తలపించేలా పాలన సాగిస్తున్నారు. కమ్యూనిస్టులు బలంగా ఉన్నప్పుడు నెహ్రూ సైతం కమ్యూనిజం విలువ తెల్సుకుని రష్యాకు స్నేహ హస్తం అందించారు. కాని ప్రస్తుత పాలకులు నియంతలుగా మారి తమ మాట వినని రాష్ట్రాలను గుప్పెట్లో పెట్టుకుని తమ తాబేదార్లుగా మార్చుకుంటున్నారు. ప్రశ్నిస్తే ఆ రాష్ట్రానికి రావలసిన నిధులు రావు. రాజ్యసభలో ప్రజా వ్యతిరేక తీర్మానాలకు చెయ్యెత్తి సమ్మతి తెలపకపోతే రాష్ట్రాన్ని నడపడం కూడ కష్టంగా మారింది. నిజమే బావ అసలు ఒక పార్టీలో గెలిచి మరో పార్టీలోకి మారడం రాజ్యాంగ వ్యతిరేకం కద బావా. ఓ పిచ్చి బావా రాజ్యాంగాన్ని ఎప్పుడో తుంగలో తొక్కి సొంత రాజ్యాంగాన్ని ఏర్పాటు చేసుకోబట్టి వేల కోట్లు బ్యాంకులకు ఎగనామం పెట్టిన ఇతర పార్టీ ఎంపీలను తమ పార్టీలో చేర్చుకోవడమే కాక వారికి కేంద్రంలో మంత్రి పదవులు కట్టబెట్టింది. ప్రస్తుతం నీతి మాలిన అవకాశవాద రాజకీయాలు కొనసాగిస్తోంది.

బావా యిటువంటి మతవాద పార్టీని దించకపోతే ప్రజలు స్వేచ్ఛ కోల్పోయి బానిస బతుకు బతకాల్సిందే కదా. ఏం చేస్తాం బావా కమ్యూనిస్టులు ఒకరే ఈ ఆలోచన చేస్తుంటే జాతీయ పార్టీ కాంగ్రెసు కుటుంబ పాలనకు స్వస్తి పలకకుండ మేధావులను, సీనియర్లను పక్కన పెట్టి బలహీన పడింది. ఇక స్థానిక పార్టీలు నిధుల కోసం, కేసుల నుండి బయటపడటం కోసం తలవంచక తప్పడం లేదు. మేధావులు, కళాకారులు, రచయితలు ప్రజల్లో చైతన్యం తెచ్చి ఉద్యమ బాట పట్టించాలి. అలా కాకపోతే బానిస బతుకు బారిన పడక తప్పదు.

ఎన్నెన్ని విజయాలో...!

టి.వి.సుబ్బయ్య

ఆర్.ఎస్.ఎస్, బి.జె.పి నాయకత్వంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం 2014లో అధికారం చేపట్టి ఎనిమిదేళ్లు పూర్తి చేసుకొన్నది. ఈ సందర్భంగా మోదీ ప్రభుత్వం సాధించిన విజయాలను అనేక రకాల ప్రచార, ప్రసార సాధనాల ద్వారా పాలకులు అనుకూల సర్వ యంత్రాంగం పనిచేస్తూ, సంబరాలు చేసుకుంటున్నారు. ఆ 'గొప్ప' విజయాలను పరిశీలించవలసిన సందర్భమిది. మోదీ కొత్త కొత్త నినాదాలు ఇవ్వడంలో దిట్ట. అలాగే గుర్తుంచుకోలేనన్ని పథకాలను ప్రవేశపెట్టారు. సంక్షోభంలో ఉన్న వ్యవసాయాన్ని బయటకు తెస్తానని, రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానని మోదీ వాగ్దానం చేశారు. రైతును ఆదుకునేందుకు ఏడాదికి మూడు విడతలుగా రూ.6 వేలు ఇస్తున్నారు. వ్యవసాయాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు మూడు దుష్ట చట్టాలు తెచ్చి రైతుల మహత్తర ఆందోళనతో చట్టాలు ఉపసంహరించుకొన్నారు. కనీస మద్దతు ధరపై కమిటీ వేస్తానని చెప్పి 6 నెలలకు పైగా గడిచింది.

ఇక విదేశాల్లో ఉన్న నల్ల ధనం తెచ్చి ప్రతి కుటుంబానికి లక్ష రూపాయలు ఇస్తానన్నారు. ఇప్పుడు నల్ల ధనం ఎంత ఉందో లెక్కించలేని పరిస్థితి ఏర్పడింది. ఇది మరింత పెరిగిందే కానీ తరగలేదు. దొంగ నోట్లు పెరిగాయని, టెర్రరిస్టులకు చేరవేస్తున్నారని, నల్ల ధనం పెరుగుతోందని నమ్మించి పెద్ద నోట్లు రద్దు చేశారు. ఇది ఆర్థిక రంగాన్ని, ప్రజా జీవనాన్ని, ఉత్పత్తి రంగాన్ని సంక్షోభంలోకి నెట్టింది. మోదీ చెప్పినవి ఏవీ నెరవేరలేదు. అనేక మంది ఆర్థిక నిపుణులు పెద్ద నోట్ల రద్దు వద్దని చెప్పినా వినలేదన్న వార్తలు వచ్చాయి. మోదీ అధికారంలోకి వచ్చాకనే ఆయా కుటుంబాలలో నెలసరి వ్యయం రూ 5 వేల నుండి రూ.పది వేల వరకు పెరిగిందని విశ్లేషకుల అంచనా. వినియోగదారుల అను భవమూ ఉంది. కొన్ని ఉదాహరణలు చూద్దాం. 2014లో ఇళ్లలో వాడుకునే గ్యాస్ సిలిండరు ధర రూ.400 లోపు ఉండగా తాజాగా సబ్సిడీని పూర్తిగా ఎత్తివేసిన ధర దాదాపు రూ.1100 అవుతుంది. సామాన్యుల, మధ్యతరగతి వారి ఆదాయం పెరిగిందా? పెరగలేదనే నిజాయితీగా చెప్పే సమాధానం. అసంఘటిత రంగం, సంఘటిత రంగంలో పనిచేసే ఉద్యోగులకు, కార్మికులకు నిజ వేతనాలు పెరిగాయని పాలకులు చెప్పగలరా? శిలాజ ఇంధనాలు పెట్రోలు, డీసెల్ ధరలు మోదీ వచ్చాక పెరుగుతూనే ఉన్నాయి గానీ తరగలేదు. ఆర్థిక పరిస్థితులన్నీ అస్తవ్యస్థంగా ఉంటే విదేశీ పెట్టుబడులు రావని, ద్రవ్యోల్బణం, ధరవరలు నిత్యం పెరుగుతూ ఆర్థిక సంక్షోభానికి దారి తీయవచ్చునని ఆందోళన చెంది ఇటీవల పెట్రోలు, డీసెల్ ధరను కాస్త తగ్గించారు. అది కూడా రాష్ట్రాలకు వాటా ఇవ్వవలసిన అవసరం లేని సుంకాల నుంచి తగ్గించి 'గొప్ప' చర్య అని చెప్పుకుంటున్నారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని కాస్త ఊరట కలిగించారు. ఇక నిత్యావసర వస్తువుల ధరలు అపారంగా పెరుగుతూనే ఉన్నాయి. 2014లో వంట నూనె లీటరు రూ.60కి అటూ ఇటుగా ఉండగా ఇప్పుడు దాదాపు రూ.200 లకు చేరింది. శిలాజ ఇంధనాల ధరలు పెరగడం వల్ల అన్ని ఆహార వస్తువుల ధరలు అమాంతం ఎగబాకాయి. కరోనా మహమ్మారి నియంత్రణకు సకాలంలో చర్యలు లేక విజృంభించి అధికార గణాంకాల ప్రకారమే ఐదు లక్షల మందికి పైగా చనిపోయారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వే ప్రకారం మృతులు పదిలక్షల పై మాటే. వైద్య చికిత్స ఏర్పాట్లు, వాక్సిన్లు, ఉత్పత్తి, పంపిణీల విషయంలో తిరస్కరించలేని వైఫల్యాలే.

ఆకలి సూచిలో మనం అత్యంత అధ్వాన్న స్థితిలో ఉన్నాం. 116 దేశాలలో సర్వే జరపగా భారతదేశం 103వ స్థానంలో ఉంది. పాలకులు చెప్పే గణాంకాలకు, వాస్తవాలకు ఎంత మాత్రం పొంతన ఉండదు. పేదల కోసమంటూ స్వచ్ఛ భారత్ అభియాన్, ప్రధాని జన్‌ధన్ యోజన, ఉజ్వల యోజన పథకాలు ఏ మాత్రం సక్రమంగా అమలు జరగలేదు. అలా జరిగి ఉంటే కోట్లాది సామాన్యుల జీవన ప్రమాణాలు పెరగాలి. అలా పెరగలేదు. ఉదాహరణకు గ్రామాలు, పట్టణాల్లో 66.42 లక్షల మరుగుదొడ్లు నిర్మిస్తామని ప్రకటించారు. లక్ష్యాన్ని సాధించామన్నారు. వీటిలో 64 శాతం నీళ్లు లేక పాడుబడిపోతున్నాయని సర్వేలు వచ్చాయి. బ్యాంకుల్లో రుణాలు తీసుకొని ఎగవేసిన బడా బాబులకు అనువైన నిర్ణయాలే ఈ ప్రభుత్వం తీసుకున్నది. మోదీ పాలనలో దాదాపు రూ.12 లక్షల కోట్లకు పైగా పారు బకాయిలు రద్దయ్యాయి. రిజర్వు బ్యాంకు అప్పుడప్పుడు ప్రకటించిన గణాంకాలే ఇవి. బ్యాంకులన్నీ దివాలా తీశాయని ప్రజలకు తెలియకుండా ఉండేందుకుగాను 20కి పైగా ఉన్న బ్యాంకులను విలీనం చేసి 12కు సంఖ్య తగ్గించారే గానీ ఎగవేతలను కాదు. కొన్ని బ్యాంకులను కార్పొరేట్లకు కట్టబెట్టారు. ఇంకా దాదాపు రూ.9 లక్షల కోట్ల రూపాయలు పారు బకాయిలున్నాయని గత ఏడాది రిజర్వు బ్యాంకు తెలిపింది. ఇప్పటికి ఇంకా పెరిగి ఉండవచ్చు. ఫిక్సిడ్ డిపాజిట్లపై వడ్డీరేట్లను గణనీయంగా తగ్గించారు. 1960 తర్వాత ఉన్న వడ్డీరేటు కంటే నేడు తక్కువగా ఉందంటే అతి శయోక్తి కాదు. వైద్య, విద్యా రంగాలను పూర్తిగా ప్రైవేటు రంగానికి కట్టబెట్టే క్రమంలో ప్రభుత్వం ముందంజలోనే ఉంది. రాష్ట్రాల హక్కులనేకం మోదీ ప్రభుత్వం తన ఖాతాలో వేసుకుంది. అన్ని ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్లకు అయిన కాడికి అమ్మే క్రమంలో ఈ ప్రభుత్వం ముందుకు సాగుతోంది. మోదీ ప్రభుత్వం సాధించిన 'విజయాలలో' ఇవి కొన్ని మాత్రమే. వీటిని వైఫల్యాలు అందామా, విజయాలనుకుందామా?

ఇక వృద్ధి సాధనలో కరోనా మహమ్మారి కాలంలోనూ బిలియనీర్ల సంఖ్యను 166కు పెంచారు. ఇదే సమయంలో నిరుద్యోగుల సంఖ్యను 9 శాతానికి పెంచారు. 45 ఏళ్ల కాలంలో నిరుద్యోగం నేడు గరిష్ఠ స్థాయికి చేరింది. మతాల మధ్య చీలికలు సృష్టించగలిగారు. అసహనాన్ని, విద్వేషాన్ని మిక్కుటం చేయగలిగారు. మధ్య యుగాల నాటి స్థాయికి ఈ సమాజాన్ని నడిపించేందుకు 'కృషి' చేస్తున్నారు. మత విభజనకు కావలసిన, చర్యలను, చట్టాలను కూడా అమలు చేయడానికి పూనుకున్నారు. మసీదుల స్థానంలో రకరకాల ఆలయాల నిర్మాణానికి అవసరమైన అలజడులను, హింసను సృష్టిస్తున్నారు. మరోవైపు అన్ని మతాలను తాము సమానంగా చూస్తున్నామని మోదీ ప్రకటించి దేశ ప్రజలను ఆశ్చర్యంలో ముంచెత్తారు. సిబిఐ, ఈడీ తదితర అనేక రాజ్యాంగ సంస్థలు స్వతంత్రత కోల్పోయి ప్రభుత్వ కనుసన్నల్లో నడుస్తున్నాయని అనేక పరిణామాలు రుజువు చేస్తున్నాయి. పాలనా విధానాలన్నీ శత కోటీశ్వరులకు అనుకూలం. పార్లమెంటులో ఎక్కువ వీరే ఉన్నారు. ఇవన్నీ ప్రభుత్వ విజయాలే. ప్రజలు నమ్మాలి మరి.

సమస్త జీవులకు సముద్రాలే రక్ష

సుమారు 35 లక్షల సంవత్సరాల క్రితం మహాసముద్రాలు ఏర్పడ్డాయి. ఇవి సమస్త జీవరాశి మనుగడకు దోహదం చేస్తూ, అభివృద్ధిలో కీలక పాత్ర వహిస్తున్నాయి. పారిశ్రామికీకరణ, పట్టణీకరణ పరుగుపందెంలో కాలుష్యం విషకోరల్లో చిక్కుక్కున్న విశ్వ మానవుడు మహా సముద్రాలకూ తీరని ముప్పు తెచ్చిపెట్టి తన మనుగడనే ప్రశార్థకం చేసుకుంటున్నాడు. ఈ ఆపద నుంచి బయట పడేందుకు మొదటిసారి కెనడా దేశం ప్రపంచ సముద్ర దినోత్సవం జరపాలని, వీటి రక్షణకు అన్ని దేశాలు దిశా నిర్దేశనం చేసుకోవాలని 1992లో బ్రెజిల్‌లోని రియో డి జనిరోలో జరిగిన ధరిత్రి సదస్సులో కోరింది. 2004లో వచ్చిన సునామీతో ప్రపంచ దేశాలు కళ్ళు తెరిచాయి. 2008 నుండి జూన్ ఎనిమిదవ తేదీన ఐక్యరాజ్యసమితి సభ్యత్వ దేశాలు ప్రపంచ సముద్ర దినోత్సవం జరుపుతూ, సముద్ర రక్షణకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించాయి. ప్రపంచ వ్యాప్తంగా సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన దిశగా అడుగులు వేస్తున్నాయి. ఈ ఏడాది ప్రపంచ సముద్ర దినోత్సవాన్ని "పునరుత్తేజం - సముద్రాల రక్షణకు ఉమ్మడి చర్యలు" ప్రధాన అంశంగా నిర్వహిస్తున్నారు.

ఈ భూమి మీద నివసిస్తున్న జీవరాశికి 50 శాతం పైబడి ఆక్సిజన్‌ను సముద్రాలు సమకూరుస్తున్నాయి. 30 శాతం కార్బన్‌డైఆక్సైడ్‌ను తమలో ఇముడ్చుకుంటున్నాయి. ప్రోటీన్ ఉత్పత్తికి మూలాధారం ఈ సముద్రాలే. 2030 నాటికి సముద్ర ఆధార పరిశ్రమలపై 40 శాతం జనాభా ప్రపంచ వ్యాప్తంగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు పొందుతారని అంచనా. ఈ నీలి గ్రహం మీద ఉన్న జీవరాశికి ఆరోగ్యం, మంచి వాతావరణం సమకూరుస్తున్నాయి. మనకు సముద్రాలకు అవినాభావ సంబంధం ఉంది అని, భూమికి సముద్రాలు ఊపిరితిత్తులు వలే పనిచేస్తున్నాయి అని గ్రహించాలి. మనకు ఆహారం, ఔషధాలు వీటి ద్వారా లభ్యమవుతున్నాయి. ఉష్ణోగ్రతలను క్రమబద్ధీకరణ చేస్తున్నాయి. వర్షపాతం సమకూర్చుతున్నాయి. సూర్యుని నుండి వచ్చే వేడిని గ్రహించి, సమతౌల్య వాతావరణం అందిస్తున్నాయి. పర్యాటక శోభ సంతరించుకున్నాయి. జనాకర్షణ పొందుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా వ్యాపార ఎగుమతులు, దిగుమతులు సుమారు 90 శాతం సముద్రాలు ద్వారానే జరుగు తుంది. ఈ సముద్రాలు ప్రపంచ మానవాళికి పెద్ద ఆర్థిక వనరు.

మహా సముద్రాలలో పది లక్షల రకాల సముద్ర జీవులు ఉన్నాయి అని అంచనా. వివిధ అగ్ని పర్వతాలు ఇమిడి ఉన్నాయి. సముద్రాల్లో లోతైన ప్రాంతం మారియానా ట్రంచ్. దాదాపు 20 కోట్ల జనాభా ప్రపంచ వ్యాప్తంగా సముద్ర తీర ప్రాంతంలో నివసిస్తున్నారు. వేల కోట్ల టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు రోజూ సముద్రాల్లో పడేస్తున్నారు. పరిశ్రమల నుంచి అపాయకరమైన మురుగు నీరు, వ్యర్థాలు చేరి సముద్రాలు కలుషితం అవుతున్నాయి. మనకు ప్రమాదాలు తెస్తున్నాయి. సముద్ర తీరం ఆక్రమణకు గురవుట, వివిధ నిర్మాణాలు, ప్రయోగాలు నిర్వహించుట ద్వారా తరచూ సూనామీలు, భయంకరమైన తుఫాన్‌లతో తల్లడిల్లే పరిస్థితి ఏర్పడింది. ప్లాస్టిక్ వ్యర్థాల కారణంగా ఏటా పది లక్షల సముద్ర జీవరాశులు మృత్యువాత పడుతున్నాయి అని ప్రపంచ సముద్ర శాస్త్ర నిపుణులు అంటు న్నారు. సముద్ర తీరం, మడ అడవులు, బీచ్‌లను, సముద్ర సంపద, మత్స్య సంపద కాపాడు కోవడానికి అన్ని దేశాల ప్రజలు ముందడుగు వేయాలి.

(నేడు ప్రపంచ సముద్ర దినోత్సవం)

రావుశ్రీ

మూడేళ్ళయ్యింది... మద్య నిషేధ ఊసేదీ?

ఎమ్మెస్

మద్య నిషేధంపై ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఎప్పుడో తేలిపోయింది. నిషేధం ఊసే మర్చిపోయిన ఏలికలు మద్యం అమ్మకాల ద్వారా ఆదాయ వనరులను సమకూర్చుకుంటుండడం ఆంధ్ర ప్రజలంతా గమనించాల్సిన విషయం. మద్యం ధరలను అమాంతం పెంచేయడంతో పొరుగు రాష్ట్రాల నుండి అక్రమ మద్యం ఏరులై పారింది. దీనిని కట్టడి చేయటానికి నానాతంటాలు పడిన ప్రభుత్వం చివరికి ధరలను కొంతమేర తగ్గించక తప్పలేదు. పై పెచ్చు అనేక రకాల కొత్త రకం బ్రాండ్లను మార్కెట్‌లోకి విడుదల చేసి అప్పటి వరకు ఉన్న బ్రాండ్లలో దాదాపు 90% బ్రాండ్లు ఎత్తేసింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యపాన నిషేధం దిశగా అడుగులు పడినట్లు కనిపించినా ఆ తర్వాతి కాలంలో మాత్రం చర్యలు శూన్యం. 2019లో కొత్త ప్రభుత్వం ఏర్పడే నాటికి రాష్ట్రంలో 4,380 వైన్ షాపులు ఉండగా వాటిని 3,500కు తగ్గించడంతో పాటు వీటిని ప్రభుత్వమే నడిపేలా చర్యలు తీసుకున్నారు. ఏటా 20% వైన్ షాపులను తగ్గిస్తూ ఐదేళ్ళ కాలంలో పూర్తిగా వైన్ షాపులు ఎత్తేస్తామని అప్పట్లో ప్రభుత్వం ప్రకటించింది. మద్యం తాగాలంటే ప్రజలు భయపడే పరిస్థితులు కల్పిస్తామని, పెద్ద పెద్ద మాల్స్, 5 నక్షత్రాల హోటల్స్‌లో మాత్రమే మద్యం అందుబాటులో ఉండేలా చేస్తామని, అక్కడ కూడా ధరలు భారీగా ఉండేలా చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అధికారంలోకి రాగానే మూడు దశల్లో పూర్తిగా మద్యపాన నిషేధం చేస్తానని తన పాదయాత్ర సమయంలోనే సంచలన ప్రకటన చేశారు జగన్. తొలి దశలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బెల్ట్ షాపులపై ఉక్కుపాదం మోపుతామని, రెండో దశలో మద్యపానం వలన కలిగే నష్టాలను ప్రజలకు తెలియజేసే విధంగా ప్రభుత్వం తరపున ప్రచారం నిర్వహిస్తామని, చివరి దశలో మద్యం రేట్లను విపరీతంగా పెంచుతామని, పేదల జీవితాల్లోకి మద్యం రాకుండా చేస్తామని జగన్ హామీ ఇచ్చారు. ప్రభుత్వానికి అతి పెద్ద ఆదాయ వనరైనప్పటికీ రిస్క్ తీసుకుని మద్యం రేట్లను పెంచుతామని చెబుతూ, మద్యం తయారు చేసినా, అమ్మినా ఏడేళ్ల శిక్ష విధించేలా చట్ట సవరణ చేస్తామని అప్పట్లో స్పష్టం చేశారు. మూడు దశల్లో మద్యాన్ని నిషేధించేందుకు రిహాబిలిటేషన్ సెంటర్లు సహా అవసరమైన అన్ని చర్యలు చేపట్టడమే కాకుండా అందుకోసం కొత్త చట్టంతో పాటు ప్రత్యేక యంత్రాగాన్ని సైతం ఏర్పాటు చేస్తామని ఎన్నెన్నో కబుర్లు చెప్పారు. మూడు దశల్లో మద్యపాన నిషేధ ప్రక్రియ కొనసాగిస్తూ, 2024 నాటికి పూర్తిగా నిషేధం విధిస్తామని, సంపూర్ణ మద్య నిషేధం అమలు చేసిన తర్వాతే 2024లో ఓట్లు అడిగేందుకు మళ్ళీ మీ వద్దకు వస్తానని జగన్ ఎన్నోసార్లు చెప్పారు. మద్యపాన నిషేధ హామీని నవరత్నాల్లో కూడా చేర్చారు.

మద్యపాన నిషేధం విషయంలో చెప్పింది ఎక్కువ చేసింది అతి తక్కువ. జగన్ సర్కార్ అధికారంలోకొచ్చి మూడేళ్ళు దాటిన నేపథ్యంలో మద్యపాన నిషేధం అమలు చేసే అంశం ఇప్పుడు రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారుతోంది. అధికారంలోకి వచ్చిన తరవాత రాష్ట్రంలో 1446 మద్యం షాపులు తగ్గించారు. 43 వేల బెల్టు షాపులు తొలగించారు. షాపుల పనివేళలు కుదించారు. షాపుల్లో తాగడానికి అవకాశం ఉన్న పర్మిట్ రూమ్‌లు రద్దు చేశారు. కానీ, మద్యం అమ్మకాలు మాత్రం తగ్గలేదు. పైగా గతం కంటే ఆదాయం పెరిగింది. మద్యం పైన షాక్ కొట్టేలా ధరలు పెంచామని ప్రభుత్వం బాహాటంగా చెబుతోంది. 2019-20లో ఎక్సైజ్ టాక్స్ రూపంలో ప్రభుత్వానికి రూ.6,914 కోట్ల ఆదాయం వచ్చింది. ఆ తరవాత ఇబ్బడిముబ్బడిగా పెంచిన రేట్లతో రూ. 7,931 కోట్ల ఆదాయం అంచనా వెయ్యగా, ఏకంగా రూ. 11, 535 కోట్ల ఆదాయం వచ్చింది. ఎక్సైజ్ టాక్స్‌తో పాటు మద్యం మీద వచ్చే వ్యాట్ ఆదాయం కూడా కలిపితే మద్యం వల్ల ప్రభుత్వానికి వచ్చిన ఆదాయం దాదాపుగా రూ. 18,000 కోట్లు. ఇక కరోనా కారణంగా ఆర్థిక మందగమనం, ఆర్థిక క్రమశిక్షణ లోపించిన కారణంగా అప్పులు దొరికే పరిస్థితి లేకపోవడంతో ఈ ఆదాయం మీదే ప్రభుత్వం ఆశలన్నీ పెట్టుకుంది. 2021-22 సంవత్సరం బడ్జెట్‌లో ఎక్సైజ్ టాక్స్‌తో మాత్రమే రూ.15,000 కోట్ల ఆదాయం అంచనా వేసింది. వ్యాట్ ద్వారా ఇంకో రూ. 5,000 కోట్లు ఆదాయం వస్తుందని అనుకుంటే రూ.20,000 కోట్ల ఆదాయం మద్యం ద్వారా సమకూరుతుందని ప్రభుత్వం అంచనా. సహజంగా మద్యం నుండి వచ్చే ఆదాయం ఎప్పుడూ అంచనాలకు మించే ఉంటుంది. అధిక రాబడి కోసం ప్రభుత్వం త్వరలో మద్యం రేట్లు కూడా ఇతోధికంగా పెంచబోతుందని అర్థమవుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని మద్యం దుకాణాలను ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ నిర్వహిస్తున్నందున ఆ ప్రభావం అమ్మకాలపై పడింది. అయినా చివరకు ప్రభుత్వానికి ఆదాయం పెరిగింది. బేవరేజెస్ కార్పొరేషన్ బార్లకు సరఫరా చేసే మద్యంపై అదనపు రిటైల్ టాక్స్ వసూలు చేస్తుండటంతో ప్రభుత్వానికి మరింత ఆదాయం వస్తోంది. ఇటీవల కాలంలో మద్యం అమ్మకాలు పెరగడానికి ప్రధాన కారణం ప్రభుత్వం ధరలు తగ్గించడమేనని తెలు స్తోంది. రాష్ట్రంలో మద్యం అక్రమ రవాణా పెరిగిపోవడం, ఇతర రాష్ట్రాల నుంచి సులువుగా మద్యాన్ని తెచ్చుకునే అవకాశం ఉండటంతో ఆ ప్రభావం క్రమంగా అమ్మకాలపై పడుతోంది. రాష్ట్రంలో మద్యం అమ్మకాల సరళిలో హెచ్చుతగ్గులు కనిపిస్తున్నా మద్యపాన నిషేధం విషయంలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తూనే ఉంది. షాపులు తగ్గించి, రేట్లు పెంచినా మద్యపాన నిషేధం దిశగా ఆశించిన ఫలితాలు కనిపించలేదని ఎక్సైజ్ విభాగం అధికారులే చెబుతున్నారు. అంటే మద్యపాన నిషేధం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న ఫార్ములా పెద్దగా ఫలితాలను ఇవ్వడం లేదు. షాపులు తగ్గించి ధరలు పెంచినా అమ్మకాలకు, తాగేవారికి ఢోకా లేకుండా పోయింది. మద్యం అమ్మకాలు పూర్తిగా నిలిపేస్తే తప్ప ప్రభుత్వ లక్ష్యం నెరవేరే అవకాశం లేదు. ఇప్పటికే ఆర్థికంగా దివాలా తీసిన ప్రభుత్వం మద్యం, పెట్రోలు, డీసెల్ అమ్మకాలపై కొంత నష్టనివారణ చేసుకుంటున్నది. మద్యపాన విమోచన ప్రచార కమిటీ నిస్తేజంగా తయారయింది. మద్యం అమ్మకాలలో భారీగా క్షీణత ఉన్నదని అప్పుడప్పుడు పేపర్ ప్రకటనలు ఇస్తూ వాస్తవాన్ని దాచిపెడుతున్నారు. మద్యపాన నిషేధాన్ని గాలికొదిలేశారు.

వ్యాస రచయిత ప్రజా సైన్స్ వేదిక రాష్ట్ర అధ్యక్షులు

విశాలాంధ్ర ఉచిత కంటి వైద్య శిబిరానికి

అపూర్వ స్పందన

విశాలాంధ్ర-దేవరాపల్లి: విశాలాంధ్ర 70వ వార్షికోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న సామాజిక కార్యక్రమాల్లో భాగంగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని మంగళవారం అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం కలిగొట్ల గ్రామంలో నిర్వహించారు. అనేక మంది వృద్ధులు చేతికర్ర సాయంతో ఉచిత కంటి వైద్య శిబిరానికి తరలివచ్చారు. విశాలాంధ్ర పేపరోళ్లు ఉచితంగా కంటి పరీక్షలు చేయిస్తున్నారంటూ వృద్ధులు తరలివచ్చారు. 'కన్నపిల్లలే మా కంటి చూపును పట్టించుకోలేదు. విశాఖపట్నం వెళ్లలేక కళ్లు చూపించుకోలేకపోతున్నాం. అలసిపోయిన మాకు కంటి పరీక్షలు చేయించిన విశాలాంధ్రకి కోటి దండాలు' అని వృద్ధులు సంతోషం వెలిబుచ్చారు. అవ్వాతాతల మాటల్లో ఆనందం, కళ్లల్లో వెలుగు కనిపించింది. వైద్య శిబిరానికి కలిగొట్లతో పాటు వాకపల్లి, తిమిరాం, అర్జునగిరి, బోయల కింతల, కొత్తూరు, గవరవరం, వేచలం నుండి 300 మందికి పైగా వచ్చారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు వైద్య శిబిరం కొనసాగింది. వైద్య శిబిరం నిర్వహణపై రెండురోజులు చుట్టుపక్కల ప్రచారం నిర్వహించారు. ఉచిత కంటి పరీక్షలకు విశేష స్పందన లభించింది. రిపోర్టరు వాసు నేతృత్వంలో భోజనాలు ఏర్పాటు చేశారు. కంటి ఆపరేషన్ అవసరమైన వారిని ప్రత్యేక బస్సులో ఆస్పత్రికి తరలించారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లా బ్యూరో పి.రామకృష్ణ, దేవరాపల్లి మండల రిపోర్టర్ గొర్రుపోటు వాసు తదితరులు నేతృత్వం వహించారు. శంకర్ ఫౌండేషన్ అధ్వర్యంలో వైద్యులు, సిబ్బంది ఉచిత కంటి శిబిరంలో పాల్గొని మందులు అందజేశారు. అనేకమందికి కంటి ఆపరేషన్లు చేయనున్నారు. ఎస్.ప్రసాద్, బి.కొండబాబు, యళ్ల పాలవెల్లి, కొటకల లక్ష్మణ, దేవుడు నాయుడు, డి.నాయుడు, వి.దేవుడుబాబు, ఎస్.చరణ్, వి.శ్రీకాంత్, యం. పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఓటీసీ కిందకు 16 రకాల మందులు

న్యూఢిల్లీ: దగ్గు, జలుబు, నొప్పులు, చర్మ సంబంధ వ్యాధులకు సాధారణంగా ఉపయోగించే మందులైన పారాసెట్‌మాల్, నసల్ డీకోంగెస్టెంట్‌లు, యాంటీ ఫంగల్స్ వంటి మందులు త్వరలో డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండానే అందుబాటులోకి రావచ్చు. ఎందుకంటే వాటిని ఓవర్-ది-కౌంటర్ (ఓటీసీ) కేటగిరీ కింద జాబితా చేయాలని కేంద్రం యోచిస్తోంది. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ అవసరం లేకుండా 16 రకాల మందులను షెడ్యూల్ కే క్రిందకు తీసుకురావడానికి కేంద్ర ఆరోగ్యమంత్రిత్వశాఖ 1945 డ్రగ్స్ రూల్స్‌కు సవరణలను ప్రతిపాదించింది. వాటిని రిటైల్ విక్రేతలు చెల్లుబాటు అయ్యే లైసెన్స్‌తో కౌంటర్‌లో విక్రయించవచ్చు. ఈ విషయంపై ఒక నెలలోగా సంబంధిత విభాగాల నుంచి సలహాలు, సూచనలు కోరుతూ మంత్రిత్వ శాఖ గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.

రక్తాన్నయినా చిందిస్తా...

బెంగాల్‌ను ముక్కలు కానివ్వను: మమత

అలిపూర్‌దూర్: పశ్చిమ బెంగాల్‌ను ముక్కలు చేసే యత్నాలు అడ్డుకునేందుకు తన రక్తాన్ని చిందించేందుకు కూడా వెనుకాడనని తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ చెప్పారు. మంగళ వారం నాడిక్కడ ఓ బహిరంగసభలో ఆమె మాట్లాడుతూ... పశ్చిమ బెంగాల్‌ను విభజించేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని, దానిని ఎప్పటికీ అనుమతించబోమని చెప్పారు. ఉత్తర బెంగాల్ పర్యటనకు ముందు, ప్రత్యేక కాంమ్తాపూర్ డిమాండ్‌ను వ్యతిరేకించినట్లయితే మమత రక్తం కళ్లచూస్తామంటూ నిషేధిత కాంమ్తాపూర్ లిబరేషన్ ఆర్గనైజేషన్ (కేఎల్ఓ) నాయకుడు జీవన్ సింగ్ బెదిరింపుల వీడియోపై ఆమె స్పందిస్తూ... 'కొంత మంది నన్ను బెదిరి స్తున్నారు, నేను వారికి భయపడను' అన్నారు. మంగళవారం నుంచి ప్రారంభమయ్యే మూడు రోజుల పర్యటనలో అలీపుర్‌దూర్, జల్పాయ్ గురిలో రాజకీయ, పరిపాలనా సభలను నిర్వహించనున్నారు. 2024లో జరిగే సార్వత్రిక ఎన్నికలకు ముందు రాష్ట్రంలో వేర్పాటువాదాన్ని పెంచడానికి కాషాయదళం ప్రయత్ని స్తోందంటూ బీజేపీపై మమత విమర్శలు గుప్పించారు. ఉత్తర బెంగాల్‌లోని అన్ని వర్గాలు దశాబ్దాలుగా సామరస్యంగా జీవిస్తున్నాయని ఆమె అన్నారు. 'ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో, బీజేపీ ప్రత్యేక రాష్ట్ర హోదా కోసం డిమాండ్ చేస్తోంది. కొన్నిసార్లు గూర్ఖాలాండ్, మరికొన్ని సార్లు ఉత్తర బెంగాల్ ప్రత్యేక రాష్ట్రాన్ని కోరుతోంది. నేను నా రక్తం చిందించడానికి సిద్ధంగా ఉన్నాను, కానీ రాష్ట్ర విభజనను ఎప్పటికీ అనుమతించను' అని మమతా బెనర్జీ అన్నారు. కాగా ముఖ్యమంత్రి పర్యటనకు ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. కాగా మమతను బెదిరిస్తూ కేఎల్ఓ విడుదల చేసిన వీడియో సందేశంలో బీజేపీకి చెందిన ముగ్గురు.. కూచ్ బెహార్ ఎంపి నిసిత్ ప్రమాణిక్, జల్పాయ్‌గురి ఎంపీ జయంత రాయ్, అలీపూర్‌దూర్ ఎంపీ జాన్ బార్లా ప్రత్యేక కామ్తాపూర్ మద్దతుదారులుగా పేర్కొనడం రాష్ట్రంలో మరింత గందరగోళాన్ని సృష్టించింది. 1995లో ఏర్పాటైన కేఎల్ఓ, ఉత్తర బెంగాల్‌లోని కొన్ని జిల్లాలు, అంతకుముందు కూచ్ బెహార్ రాజ్యంలో ఉన్న దిగువ అసోంలోని కొన్ని జిల్లాలను కలిపి ప్రత్యేక కామ్తాపూర్ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తోంది. ఈ సంస్థ ఇక్కడ క్రియాశీలకంగా లేనప్పటికీ, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఉత్తర బెంగాల్ పర్యటనకు ముందు కేఎల్ఓ వీడియో బయటకు వచ్చింది.

మైత్రి ప్లాంటేషన్ ఆస్తులు అటాచ్

వాటి విలువ రూ.110 కోట్లు: ఈడీ

న్యూఢిల్లీ : అక్రమంగా పథకాలు నడిపి ప్రజలకు శఠగోపం పెట్టిన మైత్రీ ప్లాంటేషన్ అండ్ హార్టికల్చర్ ప్రైవేట్ లిమిటెడ్ (ఎంపీహెచ్‌పీఎల్)కు సంబంధించి రూ. 110 కోట్ల విలువైన 210 స్థిరాస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అటాచ్ చేసింది. అటాచ్ చేసిన ఆస్తుల్లో ఆంధ్రప్రదేశ్‌లోని 196 స్థలాలు, తెలంగాణలో 13 స్థలాలు, కర్ణాటకలో ఓ స్థలం ఉన్నాయి. ఖాళీ మైదానాలు, ప్లాట్లు తదితర స్థిరాస్తుల మొత్తం విలువ రూ. 110 కోట్లని, పీఎంఎల్‌ఏ చట్టం కింద వీటిని అటాచ్ చేసినట్లు ఈడీ వెల్లడించింది. ఈ ఆస్తులు ఎంపీహెచ్‌పీఎల్, దాని అనుబంధ కంపెనీ శ్రీ నక్షత్రా బిల్డర్స్ అండ్ డెవలపర్స్ ప్రై.లి., మైత్రి రియల్టర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, వాటి డైరెక్టర్లు లక్కు కొండారెడ్డి, లక్కు మాల్యాద్రి రెడ్డి, లక్కు మాధవ రెడ్డి, కొలికలపూడి బ్రహ్మా రెడ్డి పేర్లపై ఉన్నట్లు తెలిపింది. ప్రైజ్‌చిట్స్ మనీ సర్క్యులేషన్ స్కీమ్స్ యాక్ట్ 1978, ఏపీపీడీఎఫ్ఈ చట్టం-1999 పరిధిలో లక్కు కొండారెడ్డి తదితరులపై ఎఫ్ఐఆర్‌ను ఆంధ్రప్రదేశ్ పోలీసులు వేర్వేరు ఐపీసీ సెక్షన్ల కింద నమోదు చేశారు. ప్రజల ఫిర్యాదుల ఆధారంగా ఏపీ పోలీసులు మొత్తం 12 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. ఈ సంస్థ ఎన్‌బీఎఫ్‌సీ లేదా సంయుక్త పెట్టుబడి పథకం పేరిట స్కీముకు ఏ రకమైన అనుమతి లేదా లైసెన్సు పొందలేదని, లక్షలాది మంది నుంచి డిపాజిట్లను సేకరించినట్లు ఈడీ విచారణలో వెల్లడి అయింది. మొత్తం రూ.288.42 కోట్లను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో ఎంపీహెచ్‌పీఎల్, ఎస్ఎన్‌బీడీఐపీఎల్, ఎంఆర్ఐపీఎల్ పేరిట సేకరించినట్లు ఈడీ తెలిపింది. సేకరించిన మొత్తంలో నుంచి రూ.158.14 కోట్లను పెట్టుబడిదారులకు ఎంపీహెచ్‌పీఎల్ చెల్లించలేదని దర్యాప్తు సంస్థ వెల్లడించింది.

భారీగా పెరిగిన మధుమేహం

- మూడు దశాబ్దాల్లో 150 శాతం పెరుగుదల
- ప్రతి ఆరుగురిలో ఒకరికి ..
- టైప్-1 బాధితుల్లో 25-35 మధ్య వయస్కులు అధికం
- ఐసీఎంఆర్ వెల్లడి

న్యూఢిల్లీ: దేశంలో మధుమేహం ఉన్న వారి సంఖ్య మూడు దశాబ్దాల్లో 150శాతానికి పెరిగిందని ఐసీఎంఆర్ వెల్లడించింది. చైనా తర్వాత మధు మేహంతో బాధపడే వారు ఎక్కువగా ఉన్నది మన దేశంలోనేనని తెలిపింది. భారత్‌లో పెరిగి పోతున్న ఈ వ్యాధి నియంత్రణ దృష్ట్యా టైప్-1 మధుమేహానికి చికిత్స, నివారణ పద్ధ తులు తదితర వివరాలు, మార్గదర్శకాలను ఐసీఎంఆర్ విడుదల చేసింది. కోవిడ్ కేసుల క్రమంలో టైప్ 1 మధుమేహం వారు సరైన జాగ్రత్తలు తీసుకోకపోయినా, వ్యాధి నియం త్రణలో లేకపోయినా కోవిడ్ తీవ్ర ప్రభావం చూపుతుందని వెల్లడించింది. జువనైల్ డయాబెటిస్ లేదా టైప్ 1 డయాబెటిస్ వల్ల జీవితంపై ఉండే ప్రభావాన్ని వివరించింది. ప్రతి ఆరుగురు భారతీయుల్లో ఒకరికి మధుమేహం ఉందని పేర్కొంది. 14ఏళ్ల లోపు పిల్లల్లో టైప్-1 మధుమేహం ఉన్న కేసులు 95,600 కాగా ఈ వయస్సువారిలో ఏటా కొత్తగా 15,900 కసులు వస్తున్నట్లు తెలిపింది. దేశంలో దాదాపు 2.5లక్షల మంది టైప్-1 మధుమేహంతో బాధపడుతున్నట్లు ఐసీఎంఆర్ వెల్లడించింది. అలాగే, పిల్లలు, యుక్త వయస్కుల్లో టైప్-2 మధుమేహం బారిన వారు 25.3శాతంగా ఉన్నట్లు తెలిపింది. చాలా మందిలో మధుమేహం లక్షణాలు కనిపిస్తున్న (ప్రీడయాబెటిస్) క్రమంలో ఈ వ్యాధి ముప్పు సమీప భవిష్యత్‌లో మరింత పెరుగుతున్న అంచనాలు ఉన్నట్లు పేర్కొంది. సంపన్నుల నుంచి మధ్యతరగతి వారికి, పేదలకూ ఈ వ్యాధి సోకుతోందని ఐసీఎంఆర్ వెల్లడిం చింది. ప్రపంచవ్యాప్తంగా టైప్ 1 డయా బెటిస్‌తో బాధపడ్తున్న మిలియన్ మంది పిల్లలు/యుక్త వయస్కులు ఉన్నట్లు తెలిపింది. టైప్ 2 మధుమేహం జీవనశైలి ఆధారంగా వస్తుందని, టైప్-1 జన్యుపరంగా వస్తుందని తెలిపింది. 25 నుంచి 34 ఏళ్ల మధ్య వయస్సు వారు పెద్ద సంఖ్యలో ఈ వ్యాధి బారిన పడుతున్నారని తెలిపింది. ఇందులో పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు పెద్దగా తేడా లేదని వెల్లడించింది. తల్లికి మధుమేహం ఉంటే పిల్లలకు ఆ వ్యాధి సోకే ప్రమాదం మూడు శాతం ఉంటుందని, అదే తండ్రి ద్వారా ఐదు శాతం, తోబుట్టువుల ద్వారా ఎనిమిది శాతం మేర ఉంటుందని ఐసీఎంఆర్ పేర్కొంది. క్లోమ గ్రంధి ద్వారా ఇన్సులిన్ ఉత్పత్తి తగ్గడంతో బ్లడ్ షుగర్ శరీర కణజాలాల్లోకి వెళ్లలేక రక్తంలో పేరుకుపోవడం వల్ల ఈ వ్యాధి వస్తుందని ఐసీఎంఆర్ తెలిపింది. జీవనశైలిలో మార్పుల ద్వారా దీనిని నియంత్రించేందుకు అవకాశం ఉంటుందని, క్రమతప్పకుండా వ్యాయామం చేయడం, ఆహార నియమాలు పాటించడం ముఖ్యమని సూచించింది.

మీ సలహాలు, సూచనలు ఇవ్వండి

సోషల్ మీడియా గ్రీవియెన్స్‌పై ఐటీ మంత్రి

న్యూఢిల్లీ: సామాజిక మాధ్యమాల ఫిర్యాదుల పరిష్కారానికిగాను ఏర్పాటు చేసే ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగం (గ్రీవియెన్స్ రీడ్రెస్సెల్ మెకానిజం)పై సలహాలు, సూచనలను కేంద్రం ఆహ్వానిస్తోంది. ఈ మేరకు సోషల్ మీడియా వినియోగదారులకు ఐటీ మంత్రి రాజీవ్ చంద్రశేఖరన్ మంగళవారం పిలుపునిచ్చారు. మెరుగైన పరిష్కార విధానాలను సూచించి అపిలేట్ యంత్రాంగాన్ని మరింత సమర్థంగా తీర్చిదిద్దటానికి సహకరించాలని కోరారు. విస్తృత సంప్రదింపుల అనంతరం జులై చివరికల్లా సోషల్ మీడియా నిబంధనలకు కొత్త సవరణలను ఖరారు చేస్తామని చెప్పారు. సామాజిక మాధ్యమాల గ్రీవెన్స్ అధికారుల నిర్ణయాలపై వినియోగదారులు అప్పీల్‌కు వెళ్లేందుకు అప్పిలేట్ కమిటీని కేంద్రం ఏర్పాటు చేయనున్న క్రమంలో ఐటీ మంత్రి ప్రకటనకు ప్రాధాన్యత నెలకొంది. కాగా, అప్పీలేట్ కమిటీ తమ వద్దకు వచ్చిన అప్పీల్‌ను 30 రోజుల్లోపు పరిష్కరించాల్సి ఉంటుంది. కమిటీ నిర్ణయాలను సోషల్ మీడియా సంస్థలు అమలు చేయాలని సవరించిన ఐటీ నిబంధనలు, 2021 నోటిఫికేషన్ తెలుపుతోంది. నిబంధనలను ఉల్లంఘించారంటూ సోషల్ మీడియాలో సెలబ్రిటీలు, ఇతరుల ఖాతాలను నిషేధించే క్రమంలో కేంద్ర ప్రభుత్వ తాజా చర్యకు ప్రాధాన్యం ఏర్పడింది.

ఎన్టీఏజీఐలో కార్బెవాక్స్‌పై చర్చ

న్యూఢిల్లీ: త్వరలో ఇక్కడ జరగనున్న ఎన్టీజీఐ సమావేశంలో కోవిడ్-19 మహమ్మారి నిరోధానికి కోవిషీల్డ్ లేదా కోవాక్సిన్‌తో పూర్తిగా టీకాలు వేసిన వారికి బయోలాజికల్-ఇ కార్బెవాక్స్‌ను బూస్టర్‌గా అనుమతించడం, టీకా రెండవ, ముందు జాగ్రత్త మోతాదు మధ్య అంతరాన్ని ఆరు నెలలకు తగ్గించడం వంటి అంశాలను చర్చించే అవకాశం ఉంది. ఈ సలహా మండలి 5 నుంచి 12 ఏళ్ల మధ్య వారికి టీకాల వివరాలను కూడా సమీక్షించవచ్చు. భారత ఔషధ నియంత్రణ మండలి (డీజీసీఐ) 18 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న వారికి ముందు జాగ్రత్త మోతాదు కోసం కార్బెవాక్స్‌ను ఆదివారం ఆమోదించింది. కార్బెవాక్స్, దేశీయంగా అభివృద్ధి చెందిన మొట్టమొదటి ఆర్‌బీడీ ప్రోటీన్ సబ్-యూనిట్ టీకా. ప్రస్తుతం 12 నుంచి 14 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఈ టీకా ఉపయోగపడుతుంది. నేషనల్ టెక్నికల్ అడ్వైజరీ గ్రూప్ ఆన్ ఇమ్యునైజేషన్ (ఎన్‌టీఏజీఐ) కోర్బెవాక్స్ వివరాలను సమీక్షిస్తుందని అధికార వర్గాలు తెలిపాయి. అలాగే మే నెలలో జరిగిన కమిటీ సమావేశంలో ప్రాథమిక షెడ్యూల్ చివరి మోతాదు, రక్షణ మోతా విరామాన్ని తగ్గించడం వల్ల ప్రయోజనం గురించి స్పష్టమైన ఆధారాలు లేవని పేర్కొంది. సమావేశంలో సమర్పించిన అధ్యయనాలు విలువైన శాస్త్రీయ సమాచారాన్ని కలిగి ఉన్నాయని, కానీ ప్రస్తుత విధాన ప్రశ్నకు నిర్ణయం తీసుకోవడంలో సహాయపడలేదని భావించింది. భారత వైద్య పరిశోధనా మండలి (ఐసీఎంఆర్) ఒమిక్రాన్ తరంగం ప్రారంభానికి, అతివ్యాప్తి చెందడానికి ముందు ప్రాథమిక షెడ్యూల్ పూర్తయిన తర్వాత మూడు, ఆరు, తొమ్మిది నెలలలో పురోగతి ఇన్‌ఫెక్షన్ రేట్లను గుర్తించడానికి జాతీయ టీకా ట్రాకర్ వేదిక నుంచి వివరాలు సేకరించమని కోరింది. ప్రస్తుతం, 18 ఏళ్ల కంటే ఎక్కువ వయస్సు ఉన్నవారు, టీకా రెండవ మోతాదును తొమ్మిది నెలలు పూర్తి చేసిన వారు ముందు జాగ్రత్త మోతాదును స్వీకరించడానికి అర్హులు. విదేశాలకు వెళ్లే పౌరులు, విద్యార్థులు ఇక నిర్ణీత తొమ్మిది నెలల వేచి ఉండే కాలానికి కంటే ముందే మోతాదును పొందేందుకు గత నెలలో కేంద్రం అనుమతించింది.

దేశ ప్రతిష్ఠను దిగజారుస్తున్న సంఘ్ పరివార్: పినరయి విజయన్

తిరువనంతపురం: మహ్మద్ ప్రవక్తపై బీజేపీ ప్రతినిధి నుపుర్ శర్మ వ్యాఖ్యలను కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తీవ్రంగా ఖండించారు. ప్రపంచం ముందు భారత ప్రతిష్ఠను సంఘ్ పరివార్ మంటగలుపుతోందని విమర్శించారు. లౌకిక ప్రజాస్వామిక వ్యవస్థగా ప్రశంసలు అందుకున్న భారత్‌ను సంఘ్ పరివార్ తన చర్యలతో ప్రపంచం ముందు సిగ్గుతో తలదించుకునేలా చేసిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. హిందుత్వ మతతత్వ వాదం దేశ సామాజిక భద్రత, ఆర్థిక సుస్థిరతను ప్రమాదంలో పడేస్తున్నాయని, విద్వేషవాదులపై కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. హిందుత్వ మత రాజకీయాలు ముస్లింలను అణిచివేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాషాయ పాలకుల ఆర్థిక విధానాల వైఫల్యానికి తోడు ఈ సమస్యలు అదనంగా దేశాన్ని వెంటాడుతున్నాయని తెలిపారు. అనేక ముస్లిం దేశాలు లక్షలాది భారతీయులకు ఉపాధి కల్పిస్తూ మన ఆర్థిక వ్యవస్థకు, అభివృద్ధికి తోడ్పడుతున్నాయని ఆయా దేశాలు ఇప్పుడు బీజేపీ, సంఘ్ పరివార్ విద్వేష రాజకీయాలను వ్యతిరేకిస్తున్నాయని చెప్పారు.

జాతీయ జెండాకు అవమానం... గుర్తు తెలియని వ్యక్తిపై కేసు

మెహసానా: గుజరాత్‌లోని మెహసానా నగరంలో ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ రోడ్‌షోకు ముందు జాతీయ జెండాను అవమానించారనే ఆరోపణలపై గుర్తు తెలియని వ్యక్తిపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు మంగళవారం ఒక అధికారి తెలిపారు. సోమవారం దిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ 'తిరంగా యాత్ర' కోసం ఆప్ మద్దతుదారులకు పంపిణీ చేయడానికి రహదారి పక్కన ఉంచిన కొన్ని జాతీయ జెండాలను ఉంచారు. అయితే త్రివర్ణ పతాకాన్ని ఓ వ్యక్తి కాళ్లతో తొక్కినట్లు వీడియోలో కనిపించడంతో కేసు నమోదు చేసినట్లు ఆ అధికారి పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం కేజ్రీవాల్ రోడ్ షో సాగిన నగరంలోని పాత బస్టాండ్ సమీపంలో ఈ వీడియోను చిత్రీకరించారు. మార్గంలోని ఒక పాయింట్ వద్ద జాతీయ జెండాలను పంపిణీ చేస్తున్నప్పుడు మధ్యాహ్నం 3 గంటల సమయంలో క్లిప్ రికార్డ్ అయినట్లు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. రోడ్‌షోలో పాల్గొనేందుకు నగరానికి చేరుకున్న ఆప్ మద్దతుదారులకు ఆమ్ ఆద్మీ పార్టీ కార్యకర్తలు త్రివర్ణ పతాకాన్ని, పార్టీ జెండాలను పంచుతూ కనిపించారు. అనేక మంది ఆప్ మద్దతుదారులు రోడ్‌షోలో భాగంగా జాతీయ జెండాలను రెపరెపలాడించారు. జాతి గౌరవాన్ని అవమానించడాన్ని నిరోధించే (సవరణచేసింది) చట్టం, 2003లోని సెక్షన్ 2 కింద నగరంలోని ఎ-డివిజన్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు సంబంధిత అధికారి వివరించారు. ఈ ఏడాది డిసెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న గుజరాత్‌లో గత మూడు నెలల్లో కేజ్రీవాల్ చేపట్టిన రెండో రోడ్ షో ఇది. ఈ ర్యాలీలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆప్ క్షేత్రస్థాయిలో బలపడాలని యత్నిస్తోంది. కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆమ్ ఆద్మీ పార్టీ గుజరాత్‌లోని మొత్తం 182 స్థానాల్లో పోటీ చేయాలని భావిస్తోంది. ఇందుకోసం ఇప్పటికే దూకుడుగా ప్రచారం ప్రారంభించింది. ఆప్ ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా 'పరివర్తన్ యాత్ర' నిర్వహించింది.

రాష్ట్రాలకు రూ.126 కోట్ల కేంద్ర నిధులు

పీఎస్‌ల నిర్మాణం, ఆధునికీకరణ కోసం విడుదల

న్యూఢిల్లీ: పోలీసు బలగాల ఆధునీకరణ, పటిష్ట పోలీసు స్టేషన్ల నిర్మాణం, ఇతర పథకాల అమలు కోసం కేంద్ర ప్రభుత్వం రూ.126.7 కోట్లను వివిధ రాష్ట్రాలకు విడుదల చేసిందని అధికారులు మంగళవారం తెలిపారు. భద్రతా సంబంధిత వ్యయం (ఎస్ఆర్ఈ) పథకం కింద ఛత్తీస్‌గఢ్‌కు రూ.22.59 కోట్లు, జార్ఖండ్‌కు రూ.2.63 కోట్లు, ఒడిశాకు రూ.14.76 కోట్లు కేంద్ర హోం శాఖ విడుదల చేసింది. అంతేకాకుండా, మహారాష్ట్రకు ప్రత్యేక కేంద్ర సహాయం (ఎస్‌సీఏ) పథకం కింద రూ.7.5 కోట్లను, పటిష్ట పోలీసు స్టేషన్ల నిర్మాణంతో పాటు ప్రత్యేక మౌలిక సదుపాయాల పథకం (ఎస్ఐఎస్) కింద క్లెయిమ్‌ల రీయింబర్స్‌మెంట్‌గా జార్ఖండ్‌కు రూ.8.39 కోట్లు, తెలంగాణకు రూ.1.61 కోట్లను, అలాగే పోలీసు బలగాల ఆధునీకరణ కోసం కేంద్ర ప్రాయోజిత పథకం కింద కేంద్ర ప్రభుత్వం వివిధ రాష్ట్రాలకు రూ.69,215 కోట్లను హోం మంత్రిత్వ శాఖ విడుదల చేసినట్లు ఒక అధికారి తెలిపారు. తీవ్రవాదం లేదా ఉగ్రవాదం కారణంగా తీవ్రంగా ప్రభావిత మైన రాష్ట్రాలకు ఎస్ఆర్ఈ కోసం రీయింబర్స్‌మెంట్ ఇస్తారు. దీనికింద, భారత రిజర్వ్ బెటాలియన్ల పెంపుదల, కేంద్ర పోలీసు బలగాలు, సైన్యానికి అందించిన రవాణా కోసం రాష్ట్రాలు చేసిన ఖర్చులను తిరిగి చెల్లిస్తారు. ఎస్‌సీఏ రాష్ట్రాలకు వారి షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళిక (ఎస్‌సీఎస్‌పీ) సంకలితంగా అందిస్తారు. ఎస్‌సీఏ నుంచి ఎస్‌సీఎస్‌పీ వరకు ఉన్న ప్రధాన లక్ష్యం షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి కార్యక్రమాలకు ఊతమివ్వడం. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలకు ఆర్థిక సహాయం అందించడం ద్వారా వారి పోలీసు బలగాలను పూర్తిగా ఆధునీకరించడానికి, సన్నద్ధం చేయడానికి సహాయాన్ని అందిస్తుంది. పోలీసు బలగాల పథకం ఆధునీకరణ కింద రాష్ట్రాల ప్రయత్నాలు, వనరులకు అనుబంధంగా ఉంది. పోలీసు బలగాల ఆధునీకరణ గొడుగు పథకం ఉప పథకంగా ఎస్ఐఎస్ అమలవుతుంది.

ఏడాది గడిచినా ఐటీ పోర్టల్‌లో అవాంతరాలే!



న్యూఢిల్లీ: ఈ-ఫైలింగ్ పోర్టల్‌లో సెర్చ్ ఆప్షన్ సరిగా పనిచేయకపోవ డాన్ని పరిశీలించాల్సిందిగా సాఫ్ట్‌వేర్ సర్వీస్ ప్రొవైడర్ ఇన్ఫోసిస్‌ను ఆదేశించినట్లు ఆదాయపు పన్ను శాఖ మంగళవారం తెలిపింది. ఐటీ పోర్టల్‌ను యాక్సెస్ చేస్తున్నప్పుడు తలెత్తు తున్న సమస్యలపై అనేకమంది వినియోగదారులు తాజాగా ఫిర్యాదు చేశారు. పోర్టల్ హ్యాక్ అయిందని నివేదించారు. కాగా ఇన్ఫోసిస్ అత్యవసర ప్రాతిపదికపై ఈ సమస్యను పరిష్కరిస్తుందని ఆదాయపన్ను శాఖ వెల్లడించింది. 'ఈ-ఫైలింగ్ వెబ్‌సైట్ సెర్చ్ ఫంక్షనాలిటీకి సంబంధించిన సమస్య మా దృష్టికి వచ్చింది. ఈ సమస్యను పరిశీలించవలసిందిగా ఆదేశించడమైంది. ఇన్ఫోసిస్ వారు వెంటనే సమస్యను పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు' అని ఆదాయ పన్ను శాఖ ట్వీట్ చేసింది. కాగా పోర్టల్‌లో ఎలాంటి డేటా ఉల్లంఘన జరగలేదని ఆర్థిక మంత్రిత్వ శాఖ అధికారులు కూడా హామీ ఇచ్చారు. యాదృచ్ఛికంగా మంగళవారం కొత్త ఇన్‌కమ్ ట్యాక్స్ పోర్టల్ ప్రారంభించిన మొదటి వార్షికోత్సవం కూడా. గత ఏడాది అనేక సందర్భాల్లో పోర్టల్‌లో సమస్యలు తలెత్తడంతో ప్రభుత్వం పన్ను రిటర్న్‌లు, సంబంధిత ఫారమ్‌లను దాఖలు చేయడానికి గడువు తేదీని పొడిగించాల్సి వచ్చింది. కొత్త ఇ-ఫైలింగ్ పోర్టల్‌ను జూన్ 7, 2021న ప్రారంభించారు. దాని పనితీరులో అవాంతరాలు, ఇబ్బందులు తలెత్తడంతో ప్రారంభం నుండి ఎగుడుదిగుడుగా ఉంది. పోర్టల్‌ను అభివృద్ధి చేయడానికి 2019లో ఇన్ఫోసిస్‌కు కాంట్రాక్టు ఇవ్వబడింది.

వైసీపీ ఇంటికెళ్లడం ఖాయం

బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా

రాజమహేంద్రవరం: ఏపీలో వైకాపా ప్రభుత్వాన్ని సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అన్నారు. రాజమహేంద్రవరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన 'బీజేపీ గోదావరి గర్జన' సభకు నడ్డా ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. జగన్ ప్రభుత్వానికి ఆర్థిక క్రమశిక్షణ లేదని, విచ్చలవిడిగా అప్పులు చేసిందని నడ్డా విమర్శించారు. కేంద్ర నిధులు, పథకాలు దారి మళ్లించారని ఆరోపించారు. జగన్ పాలనలో అభివృద్ధి కుంటుపడిందని, రాష్ట్రానికి రావాల్సిన పరిశ్రమలు వెనక్కి వెళ్లాయన్నారు. శాంతిభద్రతలు కరువయ్యాయని, ప్రశ్నించే వారిపై కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ హయాంలో అవినీతి తారస్థాయికి చేరింది... ఇసుక, భూమి, మద్యం మాఫియా అడ్డూ అదుపులేకుండా చేలరేగిపోతుందని నడ్డా జగన్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో వైసీపీ పోవాలి...బీజేపీ రావాలి అంటూ నినదిచ్చారు. తెలుగు సంస్కృతికి రాజమహేంద్రవరం ప్రతిబింబంగా ఉంటుందన్న నడ్డా... రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. 'ఏపీ అప్పుల ఊబిలో కూరుకు పోయింది. రాష్ట్రంలో రూ.8 లక్షల కోట్ల అప్పులు చేశారు. పెట్టుబడులు రాక రాష్ట్రంలో నిరుద్యోగం తాండవిస్తోంది. ఏపీలో రూ.8.7 లక్షల కోట్ల పెట్టుబడులు కేంద్రం పెడుతోంది. 2014కు ముందు దేశంలో తీవ్రమైన విద్యుత్ కోతలు ఉండేవి. గతంలో ఆరోగ్య రక్షణ, ఆరోగ్య బీమాకు ఎలాంటి హామీ లేదు. గతంలో అవినీతి, కుంభకోణాలు మాత్రమే వార్తలుగా నిలిచేవి. గతంలో బంధుప్రీతి, వారసత్వానికి పరాకాష్ఠగా పాలన సాగేది. మోదీ అధికారంలోకి వచ్చాక సంస్కరణలు తెచ్చారు. మోదీ రాజకీయ దృక్కోణాన్ని పూర్తిగా మార్చారు. ఉగ్రవాదాన్ని ఉక్కుపాదంతో అణచివేశారు. సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ నినాదంతో ముందుకెళ్తున్నాం. దేశంలో అవినీతిని పారద్రోలేందుకు చర్యలు తీసుకున్నారు' అని నడ్డా చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి అధ్వాసంగా తయారైందని, ప్రార్థనా స్థలాలపై దాడులు జరుగుతున్నాయని అన్నారు. బీజేపీ హయాంలో మాతృభాషకు పెద్దపీట వేశామని, రాష్ట్రంలో తెలుగు భాషకు అన్యాయం జరుగుతోందని వ్యాఖ్యనించారు. వివిధ సంక్షేమ పథకాలకు నిధులు తగ్గుతున్నాయని, కేంద్రం తరఫున రాష్ట్రానికి రూ.77 వేల కోట్లు అందించామని చెప్పారు. పీఎం ఆవాస్ యోజన కింద ఏపీకి 27 లక్షల ఇళ్లు, ఏపీ ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఐటీ, గిరిజన వర్సిటీ మంజూరు చేశామని నడ్డా చెప్పుకొచ్చారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.